PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 130 | విజయవాడ, మంగళవారం 12 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 12 December 2023 | Rs

గాజాలో కొనసాగుతున్న భీకర పోరు

- ఇప్పటివరకు 18వేల మందికి పైగా మృతి
- రమల్లాలో పాలస్తీనియన్ల ప్రదర్శన
- రఫా క్రాసింగ్ వద్దకు పలు దేశాల రాయబారుల బృందం

లోపలి పేజీలో..

4 వేదికలు, 41 మ్యాచ్‌లు

- ఐసిసి అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్
- డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి భారత్

ICC U19 MEN'S CRICKET WORLD CUP SOUTH AFRICA 2024

లోపలి పేజీలో..

370 రద్దుకు సమర్థన

ప్రభుత్వ చర్యకు వంత పాడిన సుప్రీం

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి • 2024 సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు జరపండి

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. ఈ అధికరణ తాత్కాలికమైనదేనని, దీనిని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుందని స్పష్టం చేసింది. జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికలు నిర్వహించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. 2019 ఆగస్టు 5న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. రాష్ట్రపతి ఆదేశం పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ నిర్ణయం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ సిపిఐ(ఎం) పిటిషన్‌తో సహా 23 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి ఒక ప్రధానమైన తీర్పును, మరో రెండు ఉప తీర్పులను ఇచ్చింది. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజయ్ ఖన్నా, బిఆర్ గవాయ్, సూర్యకాంతతో కూడిన ఈ రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించే సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్ముకాశ్మీర్‌కు అంతర్గత సార్వభౌమాధికారం లేదని, రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నప్పుడు కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయలేరని చెప్పింది. జమ్మూ కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసే సమయంలో పొందుపరచిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 తాత్కాలిక నిబంధన అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని నిబంధనలను అమలు చేయడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు ఆ తీర్పులో పేర్కొంది. ఏదైనా ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా? లేదా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానమేమీ లేదని వ్యాఖ్యానించింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019 ఆగస్ట్ ఐదవ తేదీన పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ధర్మాసనం ఆగస్ట్ 2 నుండి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబర్ 5న తీర్పున రిజర్వ్ చేసిన న్యాయస్థానం సోమవారం దానిని వెలువరించింది.



సుప్రీం చారిత్రాత్మక తీర్పు : మోడీ

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది. ఆగస్టు 5, 2019న పార్లమెంటు తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధంగా సమర్థిస్తుంది. జమ్ము కాశ్మీర్, లడఖ్‌లోని మా సోదర సోదరీమణులకు ఒక ఆశను కల్పించింది. సర్వోన్నత న్యాయస్థానం అపారమైన జ్ఞానంతో భారతీయులుగా మనం ఎంతో ప్రేమించే, గౌరవించే ఐక్యత యొక్క సారాంశాన్ని బలపరిచింది. అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు ప్రగతి ఫలాలు అందేలా చూస్తాం. ఈ తీర్పు ఒక ఆశాకిరణం. ఉజ్వల భవిష్యత్తు యొక్క వాగ్దానం. బలమైన, మరింత ఐక్యమైన భారతదేశాన్ని నిర్మించాలనే మా సమిష్టి సంకల్పానికి నిదర్శనం.

రద్దుపై విభేదిస్తున్నాం : కాంగ్రెస్

ఆర్టికల్ 370ను రద్దు చేయడాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో విభేదిస్తున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. ఆర్టికల్ 370 అనేది గౌరవానికి అర్హమైనదిగా పేర్కొంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేయడాన్ని కాంగ్రెస్ 'గౌరవప్రదంగా' అంగీకరించదని ఆ పార్టీ సీనియర్ నాయకులు పి చిదంబరం స్పష్టం చేశారు. 'అలాగే, ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతోనూ మేం గౌరవపూర్వకంగా విభేదిస్తున్నాం. భారత రాజ్యాంగానికి అనుగుణంగా సవవరించబడే వరకు ఆర్టికల్ 370 గౌరవానికి అర్హమైనది' అని చిదంబరం తెలిపారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రహోదా పునరుద్ధరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు చేసిన పరిశీలనను స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పేర్కొంది.

కలవరపరుస్తున్న సుప్రీం తీర్పు !

- సిపిఎం పొలిట్‌బ్యూరో వ్యాఖ్య

న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రప్రతిపత్తి తొలగింపును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కలవరపరిచేదిగా ఉందని సిపిఐ(ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. ఈ తీర్పు వల్ల మన రాజ్యాంగ మౌలిక లక్షణాల్లో ఒకటైన ఫెడరల్ వ్యవస్థ తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. భారత యూనియన్‌లో విలీనానికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశాక, జమ్మూ కాశ్మీర్‌కు ఎలాంటి సార్వభౌమాధికారం వుండబోదని, జమ్మూ కాశ్మీర్ రాజ్యాంగం కూడా నిరర్థకంగా మారిందని సుప్రీం తీర్పు పేర్కొంది. కానీ, ఆ విలీనంపై సంతకాలు ఇప్పుడు రద్దు చేయబడిన 370వ అధికరణలో హామీ ఇచ్చిన ప్రత్యేక హోదాను నిలుపుకునే షరతు మీదే జరిగాయి కదా? అని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది.

భారత యూనియన్‌లో ఇతర అన్ని రాష్ట్రాల మాదిరిగానే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం కూడానని సుప్రీం తన తీర్పులో పేర్కొంది. తద్వారా, 371వ అధికరణలోని వివిధ క్లాజుల కింద ఈశాన్య రాష్ట్రాలకు, మరికొన్ని రాష్ట్రాలకు మంజూరైన ప్రత్యేక హక్కులు కూడా జమ్మూ కాశ్మీర్ కోల్పోయేలా చేసిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ తీసుకున్న చర్యకు సంబంధించిన తప్పొప్పులను కూడా ఈ తీర్పు పట్టించుకోలేదు.. పైగా రాష్ట్ర ప్రతిపత్తిని కల్పిస్తామంటూ సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారని పేర్కొంది. అదే సమయంలో లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని సమర్థించింది. అంటే పూర్వపు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని పునరుద్ధరించడమనేది జరగదు, అందులో కొంత భాగానికి మాత్రమే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారు. అది కూడా కాగితంపై హామీగానే ఉన్నది. విడ్డూరమైన అంశమేమిటంటే, 2024 సెప్టెంబరు 30లోగా జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికలు నిర్వహించాలంటూ భారత ఎన్నికల సంఘాన్ని సుప్రీం

మిగతా 7లో

రాజీనామా లేఖను స్పీకర్ ఓఎస్‌డికి అందిస్తున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

వైసిపిలో పెనుమార్పులు

- 11 మందికి స్థానచలనం
- మంత్రులు మేరుగ, రజిని, ఆదిమూలపు నియోజకవర్గాల మార్పు
- త్వరలో 54 చోట్ల మార్పులు చేర్పులు
- పార్టీకి, పదవికి మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కె రాజీనామా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార వైసిపిలో మార్పులు చేర్పులను ప్రారంభించింది. గెలుపు గుర్రాలకు సీట్లు ఇవ్వాలని, అసంతృప్తులను పక్కనబెట్టే విధంగా చకచకా పావులు కదుపుతోంది. ఇటీవల వరకూ సమీక్షలతో సరిపెట్టిన సిఎం తెలంగాణలో బిఆర్‌ఎస్ ఓటమి తరువాత ముందు చర్యలు ప్రారంభించారు. తొలివిడతలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11 నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌ఛార్జులను నియమించారు. ముగ్గురు మంత్రులకూ స్థానచలనం కల్పించారు. ఒకటీ రెండు రోజుల్లో ఉభయగోదావరి, తరువాత రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల వారీ ఇన్‌ఛార్జుల మార్పులను ప్రకటించనున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటి వరకూ పార్టీలో పనిచేసిన పలువురు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. పార్టీ కష్టకాలంలో నమ్మి పనిచేసిన తమను ఇప్పుడు నమ్మలేకపోవడం ఏమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై పోటీచేసి గెలిచిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అయితే ఇంకో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో రాజీనామాను ఆమోదించరని తెలిసింది. దీనిపై ఆయన సోదరుడు అయోధ్య రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆర్‌కె ముక్కుసూటి మనిషని అందుకనే రాజీనామా చేశారని తెలిపారు. గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేరుగ నాగార్జునను సంతనూతలపాడు ఇన్‌ఛార్జిగా నియమించారు. చిలకలూరిపేట నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో మంత్రి విడదల రజినిని గుంటూరు పశ్చిమకు, ఎర్రగొండపాలెం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కొండెపి నియోజకవర్గానికి మార్చారు. కొత్తగా ఇన్‌ఛార్జులను నియమించిన వాటిల్లో ఐదు ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గాలే ఉన్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకతోటి సుచరితను తాడికొండ ఇన్‌ఛార్జిగా నియమించి ప్రత్తిపాడుకు బాలసాని కిరణ్‌కుమార్‌ను నియమించారు. కొండెపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబును

మిగతా 7లో

పేదల పట్ల ఔదార్యం చూపండి

- న్యాయవాదులకు సిఎం సూచన
- వైఎస్ఆర్ లా నేస్తం నిధులు విడుదల

వైఎస్ఆర్ లా నేస్తం పథకం నిధులు విడుదల కార్యక్రమంలో సిఎం జగన్, న్యాయవాదులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదల పట్ల ఔదార్యం చూపుతూ, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి న్యాయవాదులకు సూచించారు. వైఎస్ఆర్ లా నేస్తం పథకంలో భాగంగా సోమవారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కడం ద్వారా ఆయన నిధులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,807 మంది న్యాయవాదులకు ఆరు నెలల కాలానికి రూ.7.98 కోట్లు విడుదల చేసినట్లు సిఎం కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదులకు తోడుగా ఉంటున్న విధంగానే, పేదలకూ న్యాయవాదులు తోడుగా ఉండాలన్నారు. దీనిని తాను చేస్తున్న వినతిగా భావించాలన్నారు.

లా పూర్తి చేసుకుని వృత్తిలోకి ప్రవేశించే సమయంలో వారికి ప్రోత్సాహకరంగా ఉండేందుకు ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ లా నేస్తమే కాకుండా రూ.100కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను కూడా స్థాపించినట్లు తెలిపారు. దానివల్ల కోవిడ్ సమయంలో ఎంతో మేలు జరిగిందన్నారు. ఇది కాకుండా మర వైపు 7,733మంది న్యాయవాదులకు రూ.11.56కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. మరో 14,818 మంది అడ్వకేట్లకు మెడిక్లెయిమ్ పాలసీ కింద మరో రూ.11.41కోట్లు చెల్లించినట్లు ఆయన తెలిపారు. మరొక వైపు అడ్వకేట్స్ కమ్యూనిటీకి రూ.25కోట్లు ఇచ్చి వారికి తోడుగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, లా సెక్రటరీ జి. సత్యప్రభాకరరావు, అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ రూ.30,244 కోట్లు కోత

లోపలి పేజీలో..

'సుప్రీం'కు మహువా మొయిత్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టిఎంసి నాయకులు మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎథిక్స్ కమిటీ సభ్యుల ప్రవర్తనకు సంబంధించిన విషయాలను పరిశీలించడానికి మాత్రమే అధికారం కలిగివుంటుందని, సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని సిఫారసు చేసే అధికారం ఆ కమిటీకి లేదనేది మహువా మొయిత్రా వాదన. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందని నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. క్యాష్ ఫర్ క్వయిరీకి (ప్రశ్నల కోసం డబ్బులు పుచ్చుకోవడం) వచ్చిన ఆరోపణలపై విచారించిన ఎథిక్స్ కమిటీ ఎలాంటి నిర్దిష్టమైన ఆధారాల్లేకుండా, సరైన దర్యాప్తు చేయకుండా లోక్‌సభ నుంచి తనను తొలగించాలని సిఫారసు చేసిందని మహువా సోమవారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. వ్యాపారి దర్శన్ హీరా నందానీ ఆదేశాలతో అదానీ కంపెనీలకు సంబంధించి పార్లమెంటులో మొయిత్రా పలు ప్రశ్నలు అడిగారని, ఆమె తన లోక్‌సభ లాగిన్ ఆధారాలను హీరానం దానీతో పంచుకున్నారని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె చేసిన ఫిర్యాదుపై లోక్‌సభ స్పీకరు ఎథిక్స్ కమిటీ వేసిన సంగతి తెలిసిందే. అదానీ అక్రమాలకు సంబంధించి పలు ప్రశ్నలను సంధిస్తున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం కక్షకట్టి ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

సుప్రీం తీర్పు రాష్ట్రానికి నష్టం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా తొలగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్‌కు కూడా తీరని నష్టం చేస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది.

ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జమ్ముకాశ్మీర్‌కు ఆ హోదా తొలగిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమని పేర్కొన్నారు. ఈ తీర్పు జమ్ముకాశ్మీర్‌కే కాకుండా రాష్ట్రానికి కూడా తీరని నష్టం చేస్తుందని తెలిపారు. '2014 రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు ఆమోదించిన తీర్మానం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి. కానీ, మోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకహోదా ఇవ్వకుండా మోసం చేసింది. ఇప్పుడు ఈ తీర్పును అడ్డం పెట్టుకుని బిజెపి ప్రభుత్వం మరోసారి శాశ్వతంగా మోసం చేసే అవకాశం ఉంది. ఈ తీర్పు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు నష్టదాయకం' అని ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజలకు ముఖ్యంగా విద్యార్థి, యువజనులకు సుప్రీంకోర్టు తీర్పు ఆశాభంగం కలిగిస్తోంది. ఈ తీర్పు పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది.' అని తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- 20 నుంచి సమ్మె
- సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నాలో వక్తలు

లోపలి పేజీలో..

బిజెపియేతర పాలిత రాష్ట్రాలకు

కేంద్రం నిధుల అడ్డగింతపై ప్రతిపక్షాల నిరసన

- రాజ్యసభ నుంచి ఇండియా ఫోరం ఎంపిల వాకౌట్

లోపలి పేజీలో..

'యువగళం' @ 3 వేల కి.మీ.

- తేటగుంటలో పైలాన్ ఆవిష్కరించిన లోకేష్
- హాజరైన బ్రాహ్మణి, మోక్షజ్ఞ దేవాన్ష్

పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం తేటగుంటకు వచ్చే సరికి మూడు వేల కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ మజిలీకి గుర్తుగా యనమల గెస్ట్ హౌస్ వద్ద లోకేష్ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ, చిన్నల్లుడు భరత్, లోకేష్ భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ పాల్గొన్నారు. 219 రోజుల్లో 92 నియోజకవర్గాల్లో 217 మండలాల గుండా యాత్ర సాగింది. ఈ యాత్రలో 70 బహిరంగ సభలు, 145 సమావేశాలను లోకేష్ నిర్వహించారు. తేటగుంట పద్మనాభ ఫంక్షన్ హాలు వద్ద ఆర్‌ఎంపి డాక్టర్లు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి ఆర్‌ఎంపిలను కమ్యూనిటీ మెడిక్స్‌గా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్.అన్నవరం సాయివేదిక వద్ద కాపు సామాజిక తరగతి ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాపులను ఆర్థికంగా, రాజకీయంగా టిడిపి ప్రోత్సహించిందన్నారు. కాపు విద్యార్థులకు విదేశీ విద్య పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆర్థిక సాయం అందించామని తెలిపారు. బిసిలకు ఇబ్బంది లేకుండా ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజాపై తీవ్ర ఆరోపణలు చేశారు. పాదయాత్ర మధ్యలో దళిత నాయకులతో లోకేష్ మాట్లాడారు. జగన్ పాలనలో దళితుల మాన, ప్రాణాలకు రక్షణ కరువైందన్నారు. యువగళం పాదయాత్ర కాకినాడ జిల్లాలో ముగిసి తాండవ బ్రిడ్జి మీదుగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోకి సోమవారం రాత్రి ప్రవేశించింది.

నేటి నుండి అంగన్‌వాడీల సమ్మె

- చీఫ్ సెక్రటరీతో చర్చలు విఫలం
- ప్రధాన సమస్యలపై స్పందించని ప్రభుత్వం
- మూడు అంగన్‌వాడీ సంఘాల ఏకగ్రీవ నిర్ణయం

అంగన్‌వాడీ సంఘాలు, అధికారుల మధ్య చర్చలు జరుగుతున్న దృశ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో అంగన్‌వాడీ సంఘాలు జరిపిన చర్చలు విఫలం కావడంతో నేటి నుండి సమ్మెబాట పట్టనున్నారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుండి సమ్మెకు పిలుపునిచ్చినా మంత్రి ఉషశ్రీచరణ్‌తో సంప్రదింపులు జరుపుతామని, 12వ తేదీ వరకూ నిర్ణయాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో అందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆరున్నరగంటల నుండి ఎనిమిది గంటల వరకూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)తోపాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్‌వాడీ సంఘాల నాయకులు చర్చలు జరిపారు. చిన్న చిన్న అంశాలపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ప్రధాన సమస్యలపై స్పందించలేదు. ముఖ్యంగా తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని సంఘాలు కోరగా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దానికి తిరస్కరించారు. దీంతో సమ్మెలోకి వెళ్లాలని అంగన్‌వాడీ సంఘాల నాయకులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.05 లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు సమ్మెలోకి వెళ్లనున్నారు. సమ్మెలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసుల ముందు దీక్షలు చేపట్టనున్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని నాయకులు తేల్చిచెప్పారు. తమతో చర్చల్లో పాల్గొంటారన్న మంత్రి ఉషశ్రీచరణ్ సమావేశానికి రాకుండా చీఫ్ సెక్రటరీకి బాధ్యత అప్పగించారని నాయకులు విమర్శించారు. ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ విధానాల వల్లే అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని నాయకులు తెలిపారు. ప్రధాన కార్యదర్శితో చర్చల్లో పాల్గొన్న వారిలో సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణీ, కె సుబ్బారావమ్మ, కోశాధికారి వాణిశ్రీ(తిరుపతి), సుప్రజ(ఎన్‌టిఆర్), శేష(అనకాపల్లి) ఉన్నారు. ఎఐటియుసి తరపున లలితమ్మ, ఐఎఫ్‌టియు తరపున జ్యోతి తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు ఒక ప్రకటన చేశారు. ప్రభుత్వం వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు.

మధ్యప్రదేశ్ సిఎంగా మోహన్ యాదవ్

భోపాల్ : మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా మాజీ మంత్రి మోహన్ యాదవ్‌ను బిజెపి ఎట్టకేలకు ఖరారు చేసింది. సోమవారం నాడిక్కడ బిజెపి లెజిస్లేచర్ పార్టీ సమావేశమై ఆయనను తమ లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా లాంఛనంగా ఎన్నుకుంది. ఉజ్జయిని దక్షిణ ఎమ్మెల్యే మోహన్ యాదవ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. మధ్యప్రదేశ్ 19వ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రులుగా సీనియర్ ఎమ్మెల్యేలు జగదీష్ దేవా, రాజేంద్ర శుక్లాల పేర్లను ఖరారు బిజెపి ఖరారు చేసింది. అయితే అధికారంగా ఇంకా ప్రకటించలేదు. సోమవారం జరిగిన సమావేశంలో మోహన్ యాదవ్ పేరును ప్రస్తుత సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిపాదించారు. మోహన్ యాదవ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్ టూరిజం శాఖ మంత్రిగా 2013 నుంచి 2018 వరకూ బాధ్యతలు నిర్వహించారు. ఆరెస్సెస్‌కు నమ్మిన బంటుగా ఆయనపై ముద్ర ఉంది.

నిరుద్యోగులకు ఉచిత స్టడీ సర్కిల్

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) విడుదల చేసిన గ్రూప్-1, 2 పోస్టులకు సిద్ధమయ్యేందుకు నిరుద్యోగులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ శాఖల డైరెక్టర్లను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రూప్ పోస్టుల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పేద అభ్యర్థులకు శిక్షణ కేంద్రాలకు వేల రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి లేదన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో ఉచిత కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి కృష్ణ, ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వినూత్న ఆలోచనలతో దేశ నిర్మాణం

- యువతకు గవర్నరు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినూత్న ఆలోచనలతో దేశ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని యువతకు రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన వికసిత్ భారత్ 2047-వాయిస్ ఆఫ్ యూత్ వర్క్‌షాపునకు గవర్నరు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికసిత్ భారత్‌ను ఆదర్శంగా తీసుకుకోవాలని, 2047 నాటికి అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. అంతకముందు ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ వర్క్‌షాపులో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె శ్యామలరావు, హయ్యర్ ఎడ్యుకేషన్ స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసరు కె హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లేష్ లేఖలోని అంశాలపై జగన్ నోరు విప్పాలి

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లేశ్ ఆత్మహత్యాయత్నానికి ముఖ్యమంత్రే కారణమని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు విమర్శించారు. సాటి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంతోషం, సంక్షేమానికి సంబంధించిన అంశాలనే మల్లేష్ లేఖలో ప్రస్తావించారని, దీనిపై జగన్ స్పందించాలని కోరారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై సిఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఆ దిశగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆలోచన చేయాలని కోరారు. టిడిపి ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది న్యాయబద్ధమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరిస్తుందన్నారు.

రూ.10 వేలకోట్ల నష్టపరిహారం అందించాలి : బుచ్చయ్య

తుపాను వల్ల నష్టపోయిన రాష్ట్ర రైతాంగానికి రూ.10 వేలకోట్ల ఆర్థిక సాయం తక్షణమే అందించాలని టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. తడిచిన, రంగు మారిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కూలిపోయిన ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. మరలా పంటలు వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు ఉచితంగా అందించాలని కోరారు. రాయచోటి సిఐపై జరిగిన దాడిని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఖండించారు. గతంలో పోలీసులు రౌడీలను కొట్టేవారని, ఇప్పుడు రౌడీలే పోలీసులను కొడుతున్నారని అన్నారు. పోలీసు అధికారుల సంఘం స్పందించాలని కోరారు.

'సుప్రీం' తీర్పు చారిత్రాత్మకం : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పునిచ్చిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 370 అధికరణ రద్దును సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పునిచ్చిందన్నారు.

అభివాదం చేస్తున్న నేతలు, ధర్నా హాజరైన సమగ్ర శిక్షా ఉద్యోగులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- 20 నుంచి సమ్మె
- సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కారానికి పోరాటలే మార్గమని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. ఈ నెల 20వ తేది నుంచి నిర్వహించే సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ, అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం 'చలో విజయవాడ' కార్యక్రమం ధర్నా చౌక్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(జెఎసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు రాష్ట్రం నలుమూలాల నుంచి ఉద్యోగులు వందల సంఖ్యలో తరలివచ్చారు. జెఎసి అధ్యక్షులు బి కాంతారావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోవడం లేదని విమర్శించారు.. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల బాధలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మహత్య యత్నం చేసిన ఉపాధ్యాయుడు మల్లేష్ రాష్ట్రప్రభుత్వంపై ఐదు పేజీల చార్జ్‌షీట్ విడుదల చేశారన్నారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే త్వరలోనే ఇంటికి వెళ్తుందన్నారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఉద్యోగుల కుటుంబాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అధికారంలోకి వస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఒక్కదానిని కూడా పరిష్కరించలేదన్నారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె ధనలక్ష్మి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు బేబిరాణి, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రమాదేవి, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్టియు అధ్యక్షులు సాయి శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్-1938 ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి తదితరులు ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపి ప్రసంగించారు. ఉద్యోగుల చేపట్టే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. జెఎసినాయకులు నాయకులు శ్రీనివాస్, కళ్యాణి, గురువులు, అనిల్, జయరాజ్, వెంకట్రావు, నాగేశ్వరరావు, సునీత, చిన్నతల్లి, సాయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు వినతిపత్రం

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావును కోరారు. ధర్నా అనంతరం సమగ్ర శిక్షకార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఉద్యోగుల సమ్యలు పరిష్కరించడంతో పాటు వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి, ఎస్టియు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న ఉన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించండి

- సిసిఎల్ఎకు వినతిపత్రం సమర్పించిన సంఘం నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భూ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. సోమవారం నాడు ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి టి.అంజి, కె.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ మొగలాబి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ సిసిఎల్ఎను కలిసి డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బిఎల్ఒ డ్యూటీ నుంచి విఆర్ఎలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన డిఎను 2018 జూన్ నుండి ఇవ్వాలని, తెలంగాణ తరహాలో విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే విఆర్ఒ పోస్టులను భర్తీ చేయాలని, విఆర్ఎలకు 30శాతం ఉన్న పర్సెంటేజిని 70శాతానికి పెంచి విఆర్ఒ పోస్టు ప్రమోషన్ ఇవ్వాలని, సిపిటి ఎగ్జామ్ రద్దు చేయాలని కోరారు. విఆర్ఎ విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన వారికి ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

టైకూన్ కూడలి మూసివేతపై జనసేన నిరసన

- నాదెండ్ల మనోహర్ సహా పలువురి అరెస్టు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం), అమరావతి బ్యూరో

విశాఖ నగరంలోని సిరిపురంలోగల టైకూన్ కూడలి నుంచి విఐపి రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడంపై జనసేన పార్టీ సోమవారం చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. జనసేన పార్టీ ఆందోళన విషయం తెలిసి పోలీసులు ఆ పార్టీ నేతలను సోమవారం ఉదయానికే ముందస్తు అరెస్టులు చేశారు. ఈ క్రమంలో నోవాటెల్ హోటల్ వద్ద జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఆ పార్టీ నేతలు పంచకర్ల రమేష్‌బాబు, సందీప్, కోన తాతారావు, పసుపులేటి ఉషారాణి, బోడపాటి శివదత్తా, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్స్‌లోని కల్యాణ మండపానికి తరలించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నించారు. విఐపి రోడ్డు వైపువెళ్లే మార్గాన్ని మూసివేయడం వల్ల ప్రయాణికులు సుమారు రెండు కిలోమీటర్ల మేర అదనపు దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ నిర్మిస్తున్న భవనం వాస్తు దోషం తొలగించుకోవడానికి రోడ్డు మూసివేయడం అన్యాయమన్నారు. అరెస్టు చేసిన వారిని పోలీసులు విడుదల చేశారు.

నాదెండ్ల మనోహర్‌ను అరెస్టు చేసి వ్యాన్ ఎక్కిస్తున్న పోలీసులు

పవన్, అచ్చెన్నాయుడు ఖండన

జనసేన నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల సమస్యలను తీర్చాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు అందుకు భిన్నంగా స్థానిక ఎంపి కోసం జంక్షన్‌ను మూసివేయడం ఏమిటని ప్రశ్నించారు. నిర్బంధ ధోరణితో వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తే విశాఖ బయలుదేరి వస్తానని హెచ్చరించారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులు దౌర్జన్యం చేయడం సరికాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు అన్నారు.

మున్సిపల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- అప్పటి వరకు రాజీలేని పోరాటం
- ధర్నాలో సిఐటియు ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపాల్టీలతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకూ రాజీలేని పోరాటం నిర్వహిస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ఇచ్చిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జగనన్న హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు సోమవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో ప్రారంభమయ్యాయి. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలను నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు.

కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలుగా నిలిచాయని విమర్శించారు. రోడ్లను శుభ్రంగా తయారుచేసే మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజ్ చేస్తానని ప్రతిపక్షనేతగా జగన్ వాగ్దానం చేశారని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్సులు, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు, జిఒ 30ను సవరించి కార్మికశాఖ ప్రతిపాదనల వంటి హామీలను అమలు చేస్తామని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి జూన్‌లో జరిగిన చర్చల సందర్భంగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు వీటిని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 21 నుంచి నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, జి ఓబులు, ముజఫర్ అహ్మద్, కె ధనలక్ష్మి, మున్సిపల్ ఫెడరేషన్ కోశాధికారి ఎస్ జ్యోతిబసు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

యువగళం పాదయాత్ర ముగింపు సభలో ఎన్నికల శంఖారావం పూరిస్తాం

చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ హాజరవుతారు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా) అమరావతి బ్యూరో

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభలో ఎన్నికల శంఖారావం పూరిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సభ ఏర్పాట్లకు సంబంధించి విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలోని భూమాత లేఅవుట్‌లో సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు యువగళం పాదయాత్ర ముగింపు సభ ఐదు లక్షల మందితో నిర్వహిస్తామని చెప్పారు.

ఈ సభకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. ఈ సభను విశాఖలోని ఎయు గ్రౌండ్‌లో నిర్వహించేందుకు ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్‌కు లేఖ రాశామని, అనుమతి ఇస్తామని ముందు చెప్పి, వైసిపి ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో ఆ రోజు ఆర్గానిక్స్ డే నిర్వహిస్తామని అనుమతి ఇవ్వలేమని చెప్పారని వివరించారు. ప్రస్తుతం భూమాత లేఅవుట్ యాజమాన్యం స్థలం ఇచ్చిందని, వారిపైనా వైసిపి వారు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. అయినా, యాజమాన్యం తమకు సహకరించి సభకు స్థలం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం బస్సులు కావాలని ఆర్‌టిసి ఎమ్‌డికి లేఖ రాస్తామన్నారు. వారు నిర్ణయించే రేటు ప్రకారం బస్సులకు అద్దె చెల్లిస్తామని చెప్పారు. బస్సులు ఇవ్వకుండా ఇబ్బందిపెడితే, వంద రోజుల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని, వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కళా వెంకటరావు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభకు కమిటీలు

యువగళం ముగింపు సభకు కమిటీలను ఏర్పాటుచేసింది. సలహా కమిటీలో యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కావలి ప్రతిభా భారతి ఉన్నారు. సమన్వయ కమిటీలో కింజరాపు అచ్చెన్నాయుడు, దామచర్ల సత్య, రవికుమార్, మంతెన సత్యనారాయణరాజు, రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, మీడియా కమిటీలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టిడి జనార్ధన్, బివి వెంకట్రాముడు, ఆలూరి రమేష్ ఉన్నారు. సభా ప్రాంగణం, ఫుడ్, వాటర్, వసతి, పార్కింగ్, వేదిక నిర్వహణ, వలంటీర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, రవాణా కమిటీ, ఆర్థిక వనరుల కమిటీ, మెటీరియల్ కమిటీ, విశాఖ బ్రాండింగ్ కమిటీ, మాస్టర్ ఆఫ్ సెర్మనీ పేర్లతో కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రతి కమిటీలో ముగ్గురు, నలుగురు చొప్పున సభ్యులను నియమించింది.

అవమానించారంటూ కెజిబివి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-చిలమత్తూరు

పరీక్షల్లో కాపీ కొట్టి మార్కులు తెచ్చుకున్నావంటూ ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపానికిలోనై కెజిబివి విద్యార్థిని నైల్‌పాలిస్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు కెజిబివిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. కెజిబివి ఎస్ఒ రెహానా తెలిపిన వివరాల మేరకు... చిలమత్తూరు మండల కేంద్రానికి చెందిన నవ్యశ్రీ అదే గ్రామంలోని కెజిబివిలో 10వ తరగతి చదువుతోంది. పదవ తరగతి విద్యార్థులను పరీక్షల్లో మెరుగు పరిచేందుకు ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి వారం ఓ పుస్తకంలో పరీక్షలు రాయిస్తూ అందులో మార్కులు వేసేవారు. అందులో భాగంగా గడిచిన శనివారం వారాంతపు పరీక్ష (తెలుగు) నిర్వహించారు. ఈ పరీక్షలో నవ్యశ్రీ కాపీ కొట్టిందని తోటి విద్యార్థినులు ఒకేషనల్ ఉపాధ్యాయురాలికి ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ఆదివారం విద్యార్థిని వద్ద ఉన్న పరీక్షల రాసే పుస్తకాన్ని ఉపాధ్యాయురాలు తీసుకున్నారు. సోమవారం నాడు ఈ పస్తకాన్ని ఉపాధ్యాయురాలే స్వయంగా ఇచ్చి పరీక్షను రాయించారు. పరీక్ష రాసిన అనంతరం విద్యార్థిని మరుగుదొడ్డిలోకి వెళ్లి నైల్‌పాలిస్ తాగింది. వెంటనే గట్టిగా కేకలే వేయడంతో కెజిబివి సిబ్బంది 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సలు అందించిన వైద్యులు ప్రాణాపాయం లేదని తెలిపారు. కాపీకొట్టావని విద్యార్థులు ముందు పదేపదే ఉపాధ్యాయులు అవమానించడంతోనే తాను ఆత్మహత్యకు యత్నించానని విద్యార్థిని నవ్యశ్రీ తెలిపింది.

పబ్లిక్ హియరింగ్ తేదీలను రీషెడ్యూల్ చేయాలి

- ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మల్టీ ఇయర్ టారీఫ్ 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి 2028-29 వరకు ప్రతిపాదించారని, ఎంవైటికి స్థూలంగా లోబడి ప్రతియేటా ఎఆర్ఆర్ సమర్పించాలని, కానీ ఈ సంవత్సరం ఏకకాలంలో రెండింటినీ చేర్చడం సబబుకాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తొలుత ఎంవైటిపిపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించి తదనంతరం ఎఆర్ఆర్‌పై పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం అవసరమన్నారు. పబ్లిక్ హియరింగ్ తేదీలను విడదీసి రీషెడ్యూల్ చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌కు లేఖ రాశారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి ఎఆర్ఆర్‌లను అలాగే ఐదు సంవత్సరాలకు సంబంధించిన మల్టీ ఇయర్ టారీఫ్ ప్రపోజల్స్‌ను ఎపిఇఆర్‌సి దినపత్రికల్లో ప్రచురించి వాటిపై పబ్లిక్ హియరింగ్ తేదీలు నిర్ణయించిందని పేర్కొన్నారు. పబ్లిక్ హియరింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేస్తామని ప్రకటించారని తెలిపారు. పబ్లిక్ హియరింగ్‌ను కరోనా సమయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారని, నేడు సాధారణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ప్రతి డిస్కమ్ ప్రధాన కార్యాలయాల్లోనూ, ప్రధాన నగరాల్లోనూ రాష్ట్రంలో ఆరుచోట్ల భౌతికంగా నిర్వహించాలని ఎపిఇఆర్‌సిని కోరుతున్నట్లు వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కనీసం పాతపద్ధతిలో డిస్కమ్ ప్రధాన కేంద్రాల్లో నిర్వహించాలని ఆయన కోరారు.

రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి
- పెట్టిన కేసులు ఎత్తివేయాలంటూ కలెక్టర్లకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను విడనాడాలని, రైతు నాయకత్వంపై కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం విజయవాడ జాయింట్ కలెక్టరు పి సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ.. రైతు ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖిత పూర్వకంగా హామీనిచ్చిన కేంద్ర ప్రభుత్వం దానిని తుంగలో తొక్కిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర నాయకత్వంపై కొత్తగా 86 కేసులు మోపడం దుర్మార్గపు చర్య అని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా రైతులపై పెట్టిన కేసులకు సంబంధించి జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. లఖింపూర్ ఖేరీ ఘటనలో నిందితులైన కేంద్ర హోమ్‌శాఖ సహాయ మంత్రిని బర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన ప్రతినిధుల బృందంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు, పి జమలయ్య, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, కుర్రా నరేంద్ర, ఎం వెంకటరెడ్డి, గొల్లపూడి ప్రసాద్ ఉన్నారు.

23 నుంచి నంది నాటకోత్సవాలు

- పోసాని కృష్ణమురళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంది నాటకోత్సవా లను ఈ నెల 23 నుంచి 29 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండు మొదటి అంతస్తులోని ఆర్‌టిసి కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాటక రంగ విస్తరణకు ఎనలేని ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. ఎపి ఫిల్మ్ టివి, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటకోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. నంది నాటకోత్సవాల్లో భాగంగా 115 ప్రదర్శనలకు గానూ రాష్ట్రం నలుమూలల నుంచి పద్య, సాంఘిక, బాలల నాటికలు, కళాశాల లేదా యూనివర్సిటీ నాటిక (ప్లేలెట్స్) విభాగాల్లో ఎంపిక చేసిన 38 నాటక సమాజాలు ఈ పోటీలో పాల్గొంటున్నాయన్నారు. ఆయా విభాగాల్లో కలిపి మొత్తం 74 అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పోసాని తెలిపారు. ఎన్‌టిఆర్ రంగ స్థల పురస్కారం, వైఎస్ఆర్ రంగ స్థల పురస్కారం ఎంట్రీలకు ఈ నెల 20 వరకు గడువు ఉందన్నారు. ఎక్స్ అఫీషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటకోత్సవాలు వేడుకల ఏర్పాట్లు గుంటూరు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు.

'మిచౌంగ్'తో 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం

- లోక్‌సభలో వైసిపి ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపాను రైతులకు కన్నీటిని మిగిల్చిందని వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. సోమవారం లోక్‌సభలో అనుబంధ గ్రాంట్లు, డిమాండ్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 8 జిల్లాల్లో 20 లక్షల ఎకరాల పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిందని, దాదాపు రూ.5 వేల కోట్ల నుండి రూ.6 వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున నష్టం వాటిల్లిందని అన్నారు. విపత్తు నిధులను ఎపికి కేంద్రం అదనంగా కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎపికి విపత్తు నిధుల కేటాయింపు చూస్తే రూ.400 కోట్లు మాత్రమే ఉందని, దీన్ని రూ.2000 కోట్లకు పెంచాలని కోరారు. 3 మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట సాగు శాతం 40 శాతానికి పడిందని తెలిపారు. ఎపికి మూలధన వ్యయం కింద ఉన్న మొత్తం రూ.10 లక్షల కోట్లలో కేవలం 57 శాతం నిధులను మాత్రమే వినియోగించారని, మిగిలిన రూ.4.43 లక్షల కోట్లను వాడాలని కోరారు. వీటికి కాలవ్యవధి కూడా తక్కువగా ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల మేలు కోసం ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం హామీ ఇచ్చిన గోదావరి-పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టులో పురోగతి లేదని, దీన్ని నెరవేర్చలని కోరారు. పోలవరం ప్రాజెక్టు అభివృద్ధిని కేంద్రం మరిచిందని, దీనికోసం గత పదేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.2,937 కోట్లను వెంటనే విడుదల చేయాలని, న్యాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగుతున్న అదనపు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇవ్వాల్సిన పునరావాస నిధులను విడుదల చేయాలని కోరారు.

కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విద్యా సంస్థల హామీలు నెరవేర్చలేదని, గిరిజన యూనివర్సిటీ, ఐఐటి, ఎన్ఐటి, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, ఐపిఆర్ వంటి జాతీయ విద్యా సంస్థల్లో ఒక్కదానికి కూడా శాశ్వత క్యాంపస్ లేదని అన్నారు. రాష్ట్రం ప్రతిపాదించిన 13 కొత్త వైద్య కళాశాలల్లో 3 మెడికల్ కాలేజీలకు మాత్రమే అనుమతులు ఇచ్చారని, మిగిలినవన్నీ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే జోన్‌లు, లైన్‌ల అభివృద్ధి గురించి అడుగుతుంటుంటే.. భూ కేటాయింపులు చేయలేదని కేంద్రం కుంటి సాకులు చెబుతుందని విమర్శించారు. విభజన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేంద్రానికి తెలియదా? అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాల్లో ఒప్పందాలను మార్చుకుని, నిధులు ఇస్తున్న మాదిరి తమ రాష్ట్రానికీ అదనపు నిధులతో రైల్వే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భారత్ మాల కింద ప్రతిపాదనలో ఉన్న 7 రహదారి ప్రాజెక్టులు ఆచరణకు నోచుకోలేదని, 90 శాతం భూ సేకరణ అయిందని, రైతులకు నిధుల తరలింపు కూడా అయిందని తెలిపారు. ఎపికి ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాలని కేంద్రాన్ని కోరారు.

ఆరోగ్యశ్రీ ట్రస్టు సిఇఒగా డికె బాలాజీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా డికె బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం నాడు మంగళగిరి ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టరుగా విధులు నిర్వహించిన ఆయన ఆరోగ్యశ్రీ ట్రస్టు సిఇఒగా బదిలీపై వచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారులందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలను త్వరితగతిన అందజేస్తామన్నారు.

తొలిసారి 70వేల మార్క్‌కు సెన్సెక్స్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో దూసుకెళ్తున్నాయి. సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 70వేల మార్క్‌ను చేరి.. ఆల్‌టైం గరిష్ట స్థాయితో నూతన చరిత్రను సృష్టించింది. తుదకు 102.93 పాయింట్లు పెరిగి 69,929 వద్ద ముగిసింది. ఉదయం 69,925.63 వద్ద ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 70,058 గరిష్ట స్థాయిని తాకింది. ఈ సూచీ 70 వేల కీలక మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 27.70 పాయింట్లు పెరిగి 20,997కు చేరింది. సెన్సెక్స్-30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్స్, నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్, టాటా మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, ఎన్‌టిపిసి తదితర సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఎంఅండ్ఎం, హెచ్‌యూఎల్, మారుతీ, బజాజ్ ఫిన్‌సర్వ్, విప్రో తదితర సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఆపిల్ డిజైన్ హెడ్ రాజీనామా

వాషింగ్టన్ : ప్రీమియం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీదారు ఆపిల్ కంపెనీకి కీలక అధికారి గుడ్‌బై చెప్పారు. ఐఫోన్‌లు, ఆపిల్ వాచీల డిజైన్‌ను పర్యవేక్షిస్తున్న యాపిల్ ప్రొడక్ట్ డిజైన్ వైస్ ప్రెసిడెంట్ టాంగ్ టాన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఇది ఆపిల్ కంపెనీకి పెద్ద దెబ్బనేనని ఆ వర్గాలు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఆపిల్ ఉత్పత్తుల ఫీచర్లు, వాటి రూపం, అమరిక తదితర కీలక విషయాలను టాన్ బృందమే నిర్వహిస్తుంది.

వరి రైతులకు నర్చర్.ఫార్మ్ శిక్షణ

హైదరాబాద్ : అగ్రిటెక్ స్టార్టప్ నర్చర్.ఫార్మ్ రబీ 2023 సంబంధించి సుస్థిర వరి సాగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొంది. దీంతో సాగు ఉత్పాదకత పెంచడం ద్వారా రైతులకు సాయం నిలువనున్నట్టు పేర్కొంది. సాగు విధానాల క్రమబద్ధీకరణ, కృత్రిమ మేధనూ ఉపయోగించడం, సాగు నీటి సంరక్షణ సంకేత ద్వారా బియ్యంకు విలువలను జోడించాలని ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని తెలిపింది. వ్యవసాయ పరిశ్రమకు సంబందించిన నిపుణులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పరిశోధకులు ఈ కార్యక్రమాన్ని పరియవేక్షిస్తారని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని 10వేల ఎకరాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

స్టాక్ మార్కెట్లలో రూ.27వేల కోట్ల ఇపిఎఫ్ నిధులు

కార్మిక శాఖ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఉద్యోగ, కార్మికులకు చెందిన దాదాపు రూ.27వేల కోట్ల పైనా నిధులను కేంద్ర ప్రభుత్వం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇదే విషయాన్ని సోమవారం కార్మిక శాఖ మంత్రి పార్లమెంట్‌కు తెలిపారు. 2023-24లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో రూ.27,105 కోట్ల మొత్తానికి ఎక్స్ఛేంజీ ట్రేడ్ ఫండ్స్ (ఇటిఎఫ్)లో పెట్టుబడిగా పెట్టామని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి రామేశ్వర్ తేలి వెల్లడించారు. గడిచిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇటిఎఫ్‌లలో మొత్తంగా రూ.53,081 కోట్లు పెట్టుబడి పెట్టిందని, 2021-22లోని రూ.43,568 కోట్ల పెట్టుబడులతో పోల్చితే దాదాపు 20 శాతం ఎక్కువని రామేశ్వర్ లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇప్పటి వరకు రూ. 27,105 కోట్లను ఇటిఎఫ్‌ల్లో పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు.

2016-17లో ఇటిఎఫ్‌లలో రూ.14,983 కోట్లు, 2017-18లో రూ.24,790 కోట్లు, 2018-19లో రూ.27,974, 2019-20లో రూ.31,501 కోట్లు, 2019-20లో రూ.32,071 చొప్పున పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. అయితే.. బ్లూచిప్ కంపెనీ స్టాక్స్‌తో సహా వ్యక్తిగత స్టాక్‌లలో ఇపిఎఫ్ఒ నేరుగా పెట్టుబడి చేయదన్నారు. బిఎస్ఇ సెన్సెక్స్, నిఫ్టీ-50 సూచీల్లో ఇటిఎఫ్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం వివిధ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ వాటాల్లోనూ పెట్టుబడులు పెడుతుందన్నారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఇన్వెస్ట్‌మెంట్ విధాన ప్రకారం ఇపిఎఫ్ఒ తన ఫండ్స్‌ను ఇన్వెస్ట్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 2022 మార్చి 31 నాటికి ఇపిఎఫ్ఒ వద్ద రూ.18.30 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ ఉంది. ఇందులో 8.70 శాతం నిధులను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టింది. మిగితా 91.30 శాతం రుణ పెట్టుబడులు కలిగి ఉంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఆగస్ట్ నుంచి ఇటిఎఫ్‌ల్లో ఇపిఎఫ్ఒ పెట్టుబడులు పెడుతోంది.

పిఆర్-126పై నిషేధం

ఈ రకం వరి సాగుకే రైతుల మొగ్గు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రబీ సాగులో పిఆర్-126 రకం ధాన్యంపై అధికార యంత్రాంగం ఆంక్షలు విధించింది. ఈ రకం దిగుబడులు సాగు చేస్తే కొనుగోలు చేయబోమని ఇప్పటికే స్పష్టం చేసింది. అధిక దిగుబడి ఇచ్చే ఈ రకం సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. అధికారుల ప్రకటన వారిని ఆందోళనకు గురి చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో ఎంటియు 1121, 1156, 1153లతో పాటు ఆర్ అండ్ ఆర్ 15048 వరి రకాలను మాత్రమే పండించాలని రైతులకు ఇటీవల వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఖరీఫ్ సీజన్‌లో నల్లజర్ల, చాగల్లు, నిడదవోలు, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో 54,340 ఎకరాల్లో రైతులు పిఆర్-126ను సాగు చేశారు. ఎకరాకు 40 నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చింది. 75 కేజీల బస్తాకు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు ధర పలకడంతో ఎకరాకు రూ.20 వేలకుపైగా రైతులు లాభం పొందారు. 120 రోజుల తక్కువ కాలపరిమితిలో పండే ఈ రకం సాగు పట్ల రైతులు ముందుకు రావడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. దీంతో, రబీలో ఈ రకం లక్ష ఎకరాల్లో సాగు చేసేందుకు విత్తనాలను అందుబాటులో ఉంచుకున్నారు. అయితే, ఈ రకం వరిని సాగు చేయరాదని ప్రభుత్వం చెబుతోంది. గత నెలలో ప్రభుత్వం మిల్లర్లతో సమావేశం నిర్వహించింది. రైతులు పండించిన వివిధ రకాల ధాన్యం అమ్మకాలు, తలెత్తుతున్న ఇబ్బందులపై చర్చించింది. పిఆర్ 126 రకం వరి సాగును నిషేధించాలని నిర్ణయించింది. సాధారణ రకాలతో పోల్చితే ఈ రకం బియ్యం కొద్దిగా లావుగా ఉంటాయి. తక్కువ నీటి వాడకంతో అధిక దిగుబడి ఇచ్చే ఈ



పిఆర్-126 రకం వరి చేను (ఫైల్ ఫొటో)

వంగడాన్ని పంజాబ్ వ్యవసాయ పరిశోధన శాఖ, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ ఫిలిప్పిన్స్ సంయుక్తంగా రూపొందించాయి. పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని రైతులు ఆరేళ్లుగా ఎ-గ్రేడ్ రకంగా దీనిని సాగు చేసి ఆశాజనకమైన ఫలితాలు పొందుతున్నారు. 2016లో ఈ వరి వంగడం పంజాబ్ రకంగా మార్కెట్లో విడుదల చేశారు. ఈ రకం ధాన్యం గింజ నాణ్యత బాగుండడం, చేను పడిపోకుండా ఉండడం, ఉల్లి కోడు, ఎండాకు తెగులు, చీడపీడలను తట్టుకోగలగడం, బరువు కలిగి ఉండడంతో ప్రాచుర్యం పొందింది. గత రబీలో తెలంగాణలో వడగళ్ల వానను సైతం తట్టుకుని ఐకెపి కేంద్రాల్లో ఎ-గ్రేడు ధాన్యంగా ఈ వరి వంగడాన్ని కొనుగోలు చేశారు. పంజాబ్‌లో ఈ రకం 26 శాతం సాగు చేస్తున్నారంటే, దీనికున్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. ఈ రకం ధాన్యాన్ని పారా బాయిల్డ్ రైస్ మిల్లుల్లో మాత్రమే మిల్లింగ్ చేయాలి. రా రైస్ మిల్లులో ఆడితే నూక శాతం పెరుగుతుంది. ఈ కారణంగా బాయిల్డ్ రైస్ మిల్లర్లు మాత్రమే ఎక్కువగా దీనిని కొనుగోలు చేస్తారు. కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెటింగ్‌లో తలెత్తే ఇబ్బందుల దృష్ట్యా ఈ రకాన్ని పండించవద్దని రైతులకు సూచించినట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

అనుమతివ్వాలి

జిల్లాలో రైతుల ఆసక్తి మేరకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. పిఆర్-126 రకం వంగడంతో తక్కువ కాలంలో పంట, అధిక దిగుబడులు వస్తున్నాయి. అధిక శాతం మంది ఈ రకం సాగుకు మక్కువ చూపుతున్నారు. దీని సాగుకు అనుమతించాలి. కొనుగోలులో ఇబ్బందులను అధిగమించి రైతులకు అండగా నిలవాలి. సాగుకు రైతులకు, సలహాలు సూచనలు ఇవ్వాలి.

- తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

జిల్లా వాతావరణానికి అనుకూలం కాదు

జిల్లాలోని వాతావరణానికి పిఆర్-126 అనుకూలం కాదు. అధిక దిగుబడులు వస్తున్న మాట వాస్తవమే. పంజాబ్ వాతావరణానికి అనుకూలంగా ఈ వంగడాన్ని తయారు చేశారు. ఇక్కడి వాతావరణానికి అనుకూలం కాదు. అందరూ ఈ రకం పండిస్తే ధరలూ స్థిరంగా ఉండవు. ఇప్పటికే బోండాలు రకంలో ఇలాంటి సమస్యలు చూశాం. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నాం.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

సకాలంలో జమకాని ఇ-పేమెంట్స్

హెచ్ఒడికి వచ్చి సంజాయిషీ ఇవ్వాల్సిందేనంటున్న జిఎస్‌డబ్ల్యుఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో కీలకంగా పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు (పిఎస్ గ్రేడ్-6) వార్డు ఎడ్యుకేషన్, ప్రాసెసింగ్ సెక్రటరీలు (డబ్ల్యుఇడిపిఎస్ఎస్)పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలకు నిత్యం సచివాలయాల ద్వారా అందించే సేవలు, సర్వీసులు, ఇంటి పన్ను, నీటిపన్ను బకాయిలు, సర్టిఫికెట్లకు ప్రజలు చెల్లించే నగదును ప్రభుత్వానికి ఏరోజుకారోజు ఇ-పేమెంట్స్ ద్వారా జమ చేయాల్సి ఉంది. కొందరు డిజిటల్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి సకాలంలో జమ చేయడం లేదన్న విషయాన్ని జిఎస్‌డబ్ల్యుఎస్‌శాఖ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ వింగ్ గుర్తించింది. అంతేకాకుండా ఇ-చలానా ఖాతా వివరాలు,/బెనిఫిషియరి ఖాతా సంఖ్య (బిఎఎన్) కూడా పంపడం లేదనే విషయం బయటపడింది. జిల్లాల వారీ ఆయా జిల్లాలో వ్యక్తిగతంగా అత్యధిక మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయకుండా ఉన్నవారిని ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. అత్యధిక మొత్తం జమ చేయని 26 మంది సెక్రటరీలు ఈ నెల 12న ఉదయం పది గంటలకు విజయవాడ ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనరు ఫైనాన్స్ అధికారి ముందు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం రావిపాడు సెక్టారు-1 నుంచి రూ.1,22,907, విజయనగరం జిల్లా తోటపాలెం సెక్టారులో రూ.1,08,3219, పశ్చిమగోదావరి జిల్లా మొగళ్తూరు పరిధిలోని జగన్నాథపురం సెక్టారు నుంచి రూ.97,738, ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్టేల సెక్టారు నుంచి రూ.90,868 పెద్ద మొత్తంలో ఇ-పేమెంట్స్ ప్రభుత్వానికి జమకాని వాటి జాబితాలో ఉన్నాయి. అయితే డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీల వాదన మరో విధంగా ఉంది.

ఇ-పేమెంట్స్ సరళీకృతం చేసుకునేందుకు బ్యాంకర్లతో కుదుర్చుకున్న ఎంఒయు సక్రమంగా అమలు కావడం లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అజమాయిషీ బాధ్యతలు డిడిఒలకూ ఉందని, వారు సకాలంలో అందుబాటులో ఉండకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని డిజిటల్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-6 సెక్రటరీకి చెక్‌బుక్ అధికారాలు ఇస్తే చెల్లింపులు సకాలంలో చేసే అవకాశం ఉంటుందని, చెక్ పుస్తకం అధికారం డిడిఒలు, ఇన్‌ఛార్జి పంచాయతీ సెక్రటరీల వద్ద ఉండటంతో వారు అందుబాటులో లేకపోవడంతో కొంత జాప్యం జరుగుతున్నట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఇ-సర్వీస్ అకౌంట్లలో లోపాలను సరిదిద్దకపోవడంతో ఇటువంటి సమస్యలు వస్తున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఏక మొత్తంలో చెల్లించేందుకు బిల్‌డెస్క్ యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా జమ చేసే అవకాశం ఉందని తెలిపారు. సచివాలయం అకౌంట్లకు ఫోన్‌పే, గూగుల్ పే సౌకర్యం ఉండదని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహకమేది?

కేంద్రం తీరుపై రాష్ట్రం అసంతృప్తి

మరో లేఖ రాయాలని నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చే విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు దాటినా ఈ అంశంపై కేంద్రం స్పందించడం లేదని ఆరోపిస్తోంది. 2014 రాష్ట్ర విభజన నేపథ్యంలో చట్టంలోని సెక్షన్ 46 (2) (3) మేరకు పరిశ్రమలకు ప్రోత్సాహకాలను కేంద్రం అందించాల్సిన విషయం తెలిసిందే. ఈ విషయమై కేంద్రానికి ఎన్ని సార్లు విజ్ఞప్తులు చేసినా, ఎన్ని లేఖలు రాసినా ఫలితం ఉండటం లేదని అధికారులు అంటున్నారు. రాష్ట్రానికి రావాల్సిన హామీలపై సాధారణ పరిపాలన శాఖ కూడా అనేక సందర్భాల్లో సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తోంది. గడచిన ఏడాదిగా ఇటువంటి సమీక్షలు దాదాపు పదికిపైగా జరిగాయని అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షల ఫలితాలపై కేంద్రానికి కూడా పలు దఫాలుగా లేఖలు రాసిన ఫలితం ఉండటం లేదని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని, వీలయితే స్వయంగా వెళ్లి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల రాసిన లేఖలో "తొమ్మిదేళ్లుగా ప్రోత్సాహకాలపై కోరుతున్నా కూడా మీరు స్పందించడం లేదు. పన్నుల్లో ప్రోత్సాహకాలకు కావాల్సిన నిధులను బడ్జెట్‌లోపొందుపరచడంలేదు"అనిప్రభుత్వప్రధానకార్యదర్శి పేర్కొన్నారు.

రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం : కేంద్రం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒక్కరు తెలిపారు. ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 20 శాతం, పరోక్ష పన్ను వసూళ్లలో 5 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. ప్రథమార్థంలో మెరుగైన వసూళ్ల జరిగాయన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.33.61 లక్షల కోట్లు వసూళ్లు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.18.23 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.15.38 లక్షల కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

విశాఖ మెట్రో కోసం ఎటువంటి ప్రతిపాదన లేదు

కేంద్ర మంత్రి కౌషల్ కిషోర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ మెట్రో కోసం కేంద్ర ప్రభుత్వం ఆమోదం రీత్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదన లేదని కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి కౌషల్ కిషోర్ తెలిపారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మెట్రో రైల్ పాలసీ-2017లోని నిబంధనలకు అనుగుణంగా సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు, ఆవశ్యకత, వనరుల లభ్యత ఆధారంగా పట్టణ రైలు ఆధారిత వ్యవస్థకు ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. ప్రస్తుతం, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదన ఏదీ లేదని అన్నారు.

స్మార్ట్ సిటీల నిధుల్లో 83 శాతం ఖర్చు

ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు స్మార్ట్ సిటీల నిధుల్లో 83 శాతం ఖర్చు అయిందని కేంద్ర సహాయ మంత్రి కౌషల్ కిషోర్ తెలిపారు. వైసిపి ఎంపి వి విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నాలుగు స్మార్ట్ సిటీలకు మొత్తం రూ.3,538 కోట్లు విడుదల కాగా, అందులో 2,951.81 (83 శాతం) కోట్లు ఖర్చు అయినట్లు మంత్రి తెలిపారు. రూ.586.19 కోట్లు (17 శాతం) ఖర్చు కాలేదు. ఇందులో అమరావతి స్మార్ట్ సిటీకి రూ.1,016 కోట్లు విడుదల చేయగా, రూ.779.29 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రూ.236.71 కోట్లు ఇంకా ఖర్చు చేయలేదు. కాకినాడ స్మార్ట్ సిటీకి రూ.978 కోట్లు విడుదల కాగా, రూ.783.57 కోట్లు ఖర్చు చేశారు. రూ.194.43 కోట్లు ఖర్చు చేయలేదు. తిరుపతి స్మార్ట్ సిటీకి రూ.578 కోట్లు విడుదల కాగా, రూ.550.48 కోట్లు ఖర్చు చేశారు. రూ.27.52 కోట్లు ఖర్చు చేయలేదు. విశాఖపట్నం స్మార్ట్ సిటీకి రూ.966 కోట్లు విడుదల కాగా, రూ.838.47 కోట్లు ఖర్చు చేశారు. రూ.129.53 కోట్లు ఖర్చు చేయలేదు. నాలుగు స్మార్ట్ సిటీల్లో 283 ప్రాజెక్టులకు గానూ, 224 ప్రాజెక్టులు పూర్తి కాగా, 59 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

క్వారీని పరిశీలిస్తున్న నర్సింగరావు, తదితరులు

డిజైన్‌స్లేట్ పరిశ్రమను ఆదుకోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా)

డిజైన్ స్లేట్ పరిశ్రమను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా పారిశ్రామికవాడలోని పలకల పరిశ్రమ, క్వారీలను సిఐటియు బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ డిజైన్ స్లేట్ పరిశ్రమపై రాయల్టీ, లైసెన్స్ అనే పేరుతో భారీగా పన్నులు విధించడంతో పరిశ్రమ పూర్తిగా అంతరించిపోయే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. వెంటనే పలకల పరిశ్రమ పునరుద్ధరణ కోసం తగు చర్యలు తీసుకొని పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు. కరువు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మార్కాపురం ప్రాంతంలో ఉపాధినిస్తున్న అతి పెద్ద పరిశ్రమ డిజైన్ స్లేట్ అని తెలిపారు. నాడు పరిశ్రమలో పది వేల మంది కార్మికులతో నిత్యం పని జరుగుతూ ఉండేదని, నేడు వెయ్యి మంది లోపు మాత్రమే పనిచేస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే కారణమని అన్నారు. ప్రభుత్వం వెంటనే పరిశ్రమపై భారీ మొత్తంగా విధిస్తున్న పన్నులు తగ్గించాలని, రాయితీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కట్టడాలకు డిజైన్ స్లేట్ వాడే విధంగా నిర్ణయం తీసుకోవాలని, కార్మికులకు ఉపాధి పెంచే మార్గాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, అధ్యక్ష, కార్యదర్శులు కె సుబ్బరాయుడు, పి రూబెన్, డిజైన్ స్లేట్ యూనియన్‌అధ్యక్షులు బాలశేషయ్య, వెంకటరెడ్డి, ప్రకాశం, రాములు పాల్గొన్నారు.

భూ హక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ లాయర్ల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఆమదాలవలస

డిఆర్ఒకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

ఎపి భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లాలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా కోర్టు నుంచి జిల్లాపరిషత్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఆమదాలవలస కోర్టులో విధులు బహిష్కరించి బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంలో పొందుపరిచిన సెక్షన్ 37, 38, కొన్ని ప్రావిజన్లలో పేర్కొన్న అంశాలు ప్రజలకు, న్యాయవాదులకు గొడ్డలిపెట్టువంటివన్నారు. సివిల్ కోర్టుల పరిధి నుంచి పూర్తిగా లిటిగేషన్‌ను తప్పించి, ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమిస్తుందని చెప్పారు. లిటిగెంట్ పబ్లిక్ ఆస్తిపై హక్కులను పరిష్కరించి తీర్పు వెలువరించే అధికారం ట్రిబ్యునల్‌కు ఇచ్చిందని తెలిపారు. ఆ అధికారి ఇచ్చే తీర్పుపై అభ్యంతరం ఉంటే స్థానిక సివిల్ కోర్టులల్లో కాకుండా హైకోర్టుకు మాత్రమే అపీల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల న్యాయవాదుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు న్యాయం దూరమవుతుంని, అధికారుల చేతుల్లోకి వెళ్లడం వల్ల రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఈ నెల 15వ తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి రాము, ఎం భవానీ ప్రసాద్, ఆమదాలవలసబార్ అసోసియేషన్ అధ్యక్షులు చాపర విజయలక్ష్మి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, వి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థల్లో భారీగా ఖాళీలు

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోనూ అదే పరిస్థితి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థ (పిఎస్‌యు)ల్లో భారీగా ఖాళీలు ఉన్నాయి. అలాగే మంజూరైన ఉద్యోగాల సంఖ్య కూడా తగ్గుతున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రతి ఏడాదీ ఉద్యోగాలను కుదించుకుంటూ వస్తోంది. సోమవారం రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమల్లో ఉన్న ఖాళీలు, ఉద్యోగాల కోత వివరాలు స్పష్టం అయ్యాయి. మొత్తం ఏడు ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమల్లో 11,572 ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీలు ఏడాదికి ఏడాది పెరుగుతున్నాయి. అలాగే రెండు ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థల్లో 13,983 ఉద్యోగాలు తగ్గాయి.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్))లో మొత్తం 19,795 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌పోస్టులుండగా, అందులో 5,124 ఖాళీలు ఉన్నాయి.అలాగే 2019 ఏప్రిల్ 1లో 2,221 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి ఖాళీలు 5,124కు పెరిగాయి. ఖాళీలు 2019లో 2,221, 2020లో 2,229, 2021లో 3,030, 2022లో 4,099, 2023లో 5,124కు పెరిగాయి.



నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండిసి)లో మొత్తం 5,247 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 628 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 561 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి ఖాళీలు 628కు పెరిగాయి.

కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ (కెఐఒసిఎల్)లో మొత్తం 2,738 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 2,084 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 1,898 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి ఖాళీలు 2,084కు పెరిగాయి.

మెకాన్ లిమిటెడ్ కంపెనీలో మొత్తం 1,897 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 838 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 646 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి ఖాళీలు 838కు పెరిగాయి.

ఎంఎస్‌టిసి లిమిటెడ్ కంపెనీలో మొత్తం 484 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 184 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 126 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి ఖాళీలు 184కు పెరిగాయి.

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)లో మొత్తం 6,880 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 1,269 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 912 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి ఖాళీలు 1,269కు పెరిగాయి. ఎంఒఐఎల్‌లో 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 6,960 పోస్టులు ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి 80 కుదించి, 6,880కు చేరాయి.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో మొత్తం 60,631 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 1,445 ఖాళీలు ఉన్నాయి. సెయిల్‌లో 2019 ఏప్రిల్ ఒకటి నాటికి 74,534 పోస్టులు ఉండగా, 2023 ఏప్రిల్ ఒకటి నాటికి 13,903 పోస్టులు కుదించి, 60,631 పోస్టులకు చేర్చారు.

హడలెత్తిస్తున్న ఏనుగులు

- పంటలపై దాడులు
- రూ. లక్షల్లో నష్టం

ప్రజాశక్తి- వికోట (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా వికోట మండలంలో 14 ఏనుగులు గుంపుగా సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాదోళనకు గురిచేస్తున్నాయి. సోమవారం వేకువ జామున గ్రామాల్లో స్వైర విహారం చేస్తూ పంటలపై దాడి చేశాయి. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు అటవీశాఖ సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ అవి పంట పొలాల్లోకి రావడంతో వాటిని అడ్డుకోలేక పోయారు. చివరకు గ్రామస్తుల సహకారంతో అటవీ శాఖ సిబ్బంది అరుపులు, డప్పు శబ్దాలతో, టపాకాయలు కాల్చుతూ ఏనుగుల గుంపును అడవిలోనికి మళ్లించారు. గత రెండు నెలలుగా వికోట, బైరెడ్డిపల్లి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఈ ఏనుగుల గుంపు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దానమయ్యగారిపల్లి, కొమ్మరమడుగు, నక్కనపల్లి,



పంటల పైకి చొరబడుతున్న ఏనుగుల గుంపు

మోట్లపల్లి, బాలేంద్రపల్లి, ఎర్రినాగేపల్లి, వడ్డిపల్లి తదితర గ్రామాలలోని పంట పొలాల్లో ఏనుగుల గుంపు చొరబడింది. ఈ దాడుల్లో టమోటా, బీన్స్, మొక్కజొన్న, అరటి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అప్పులు చేసి పండించిన పంటలు చేతికందే సమయంలో ఏనుగుల వల్ల దాదాపు రూ. రెండు లక్షలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల భారీ నుండి తమకు శాశ్వత పరిష్కారం కల్పించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం సత్వరం అందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలడిగితే అరెస్ట్ చేశారు

- పేదల భూస్వాధీన పోరాటంపై పోలీసుల ఓవరాక్షన్
- ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు అరెస్టు

ప్రజాశక్తి-గోరంట్ల

పేదలపై పోలీసులు మరోసారి జులుం ప్రదర్శించారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని బలవంతంగా అడ్డుకున్నారు. పేదలకు అండగా నిలిచిన సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలో సోమవారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన నిరసన ర్యాలీ అడ్డగింతలు, అరెస్టులతో ఆ ప్రాంతం అట్టుడుకింది. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో గత 20 రోజులుగా భూస్వాధీన ఉద్యమం జరుగుతోంది. సోమవారం పేదలు తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గోరంట్ల బస్టాండ్ నుంచి దాదాపు 200 మంది పేదలు తహశీల్దార్ కార్యాలయం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ ర్యాలీకి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితరులు నాయకత్వం వహించారు. ర్యాలీ ప్రారంభం అవగానే గోరంట్ల సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు చుట్టుముట్టారు. ఎక్కడివారిని అక్కడ బలవంతంగా అరెస్టు చేసేందుకు పూనుకున్నారు. ఇంతియాజ్, పెద్దన్న, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, హనుమయ్య, వెంకటేశులును అరెస్టు చేశారు. ఈ సమయంలో అడ్డుపడిన పేదలను పక్కకు ఈడ్చేసి సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి గోరంట్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరును నిరసిస్తూ పేదలు పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఆందోళన కొనసాగుతుండగానే సిపిఎం నాయకులను గోరంట్ల పోలీసు స్టేషన్ నుంచి సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. అక్కడ అరెస్టులను నిరసిస్తూ పేదలు రాస్తారోకో చేపట్టారు. సాయంత్రం సిపిఎం నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ సొంతిళ్లు లేని పేదలుపట్టాలుఅడుగుతుంటే ఇలా అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపాలని చూడకుండా, ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ర్యాలీ చేయడానికి వీల్లేదంటూ మహిళలను బెదిరిస్తున్న పోలీసులు

సంపాదకీయం

రైతు పక్షం వహించాలి

ఏకకాలంలో కరువు కాటు తుపాను పోటులకు రైతాంగం అతలాకుతలమై దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వ్యవసాయం సంక్షోభం అంచుకు చేరగా, సాగుదారులపై ఒకదాని వెంట మరొక విపత్తు కత్తి దూయడం శరాఘాతం. డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తీవ్ర తుపాన్ కోస్తాలోని అన్ని జిల్లాలపై ప్రతాపం చూపింది. లక్షల ఎకరాల్లో చేతికొచ్చిన ఖరీఫ్ పంటలను ఊడ్చేసింది. ప్రధానంగా కోతకొచ్చిన వరి పైరు వరదలో పూర్తిగా మునిగిపోయింది. కల్లాల్లో కోసిన పంట, ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇత్యాది పంటలు వర్షార్పణమయ్యాయి. రబీలో సాగు చేసిన శనగ, మినుము, పొగాకు తదితర పంటలూ మట్టిపాలయ్యాయి. ఈదురుగాలులకు కోస్తా, రాయలసీమల్లో తోటలు నేలమట్టమయ్యాయి. తుపాన్ వెలిసి రోజులు గడుస్తున్నా ఎన్యూమరేషన్ లేదు. ముఖ్యమంత్రి వద్ద సమీక్షలో నష్టం నాలుగు లక్షల ఎకరాల్లోనేనన్నారు. కాగా క్షేత్ర స్థాయిలో తుపాన్ విధ్వంసం మాటలకందకుండా ఉంది. నష్టం అంతకు నాలుగు రెట్ల పైమాటేనంటున్నారు. నష్టపోయిన రైతులను తప్పకుండా ఆదుకుంటామని, అన్యాయం చేయబోమని తుపాన్ ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా సిఎం జగన్ హామీ ఇచ్చారు.

భౌగోళిక, వాతావరణ పరిస్థితుల రీత్యా ఆంధ్రప్రదేశ్‌కు నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపానులు సాధారణం. అందుకనుగుణంగా నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టం ప్రభుత్వ బాధ్యత. తుపానొచ్చే సమయానికి ఖరీఫ్ కోతలు పూర్తయ్యే విధంగా కాల్వలకు నీరు విడుదల చేస్తున్నామని సర్కారు చెపుతున్నా వర్షాభావం, ప్రాజెక్టుల్లో నీటి కొరత, కాల్వలకు మరమ్మతులు లేక చివరి భూములకు నీరు చేరని దుస్థితి, మెట్ట ప్రాంతాల్లో కరువు, కరెంట్ కోతలు వెరసి ఎప్పటికంటే కూడా ఈ మారు ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. అన్ని అడ్డంకులనూ దాటుకొని పంట పండిస్తే సరిగ్గా కోతల వేళకు తుపానొచ్చి నీటిపాల్జేసి అన్నదాతల వెన్ను విరిచింది. పెట్టుబడులు సైతం దక్కని దైన్యం. నోటికాడికొచ్చిన పంట కళ్ల ముందే ఆగమాగమవుతుంటే రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయి. మనస్తాపంతో రైతుల, కౌలు రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకోవడం విషాదం.

రైతు పక్షపాతులమని ఊరూ వాడా టముకేసుకుంటున్న ప్రభుత్వం విపత్తు రైతులను ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందనడానికి సర్కారు చేతలే నిదర్శనం. తుపానొచ్చి చేలు కొట్టుకుపోయి విలవిలాడుతున్న రైతులను ముఖ్యమంత్రి పరామర్శించిన తీరే సాక్ష్యం. కనీసం పొలం వద్దకెళ్లలేదు. ఆపన్నులకు ప్రభుత్వం ఇచ్చే విలువేంటో, బాధితులకు చేసే సహాయంపై సర్కారు చిత్తశుద్ధి ఏంటో ఈ ఘటనలతో తెలిసిపోతుంది. కరువుపైనా ఇదే బడి. ఖరీఫ్‌లో 400కు పైన మండలాల్లో దుర్భిక్షం ఉందని రైతులు భోరుమంటున్నా కరువు కాస్తేనని 103 మండలాలకు పరిమితం చేసింది. ఖరీఫ్ ముగిసిన రెండు మాసాలకు కేంద్ర బృందాలంటున్నారు. ఎప్పటికి పరిహారం, బీమా ఇస్తారో తెలీదు. ఇప్పుడొచ్చిన తుపాన్ సాయం ఎప్పటికో? వాస్తవ నష్టాలకు, ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీకి పొంతనే లేదు. ఉదాహరణకు ఎకరా వరికి రైతుకు పెట్టుబడి రూ.20 వేలైతే ప్రభుత్వం ఇచ్చేది రూ.6,800 మాత్రమే. దానికే రైతులను ఆదుకుంటున్నామంటున్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్ల హామీలూ నీటిపై రాతలేనని గత అనుభవాలు చెప్తున్నాయి. రూ.2 వేల కోట్ల విపత్తు నిధి ఏమైందో తెలీదు. కరువు, తుపాన్ సహాయంపై కేంద్రాన్ని రాష్ట్రం అడిగింది లేదు. అటు కేంద్రమూ మాట్లాడట్లేదు. డ్రైనేజి వ్యవస్థకు తుపాన్, కరువులతో కోలుకోలేని స్థితిలో ఉన్న రైతులకు సముచిత స్థాయిలో పరిహారం చెల్లించాలి. బీమా ఇవ్వాలి. తిరిగి పంటలేసుకోడానికి రుణాలు, విత్తనాలు సమకూర్చాలి. జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులివ్వాలని కేంద్రంపై ఒత్తిడి చేయాలి. అఖిలపక్షం వేయాలి. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలి. తుపాన్ బాధిత ప్రజలకు తక్షణ సహాయం అందించాలి. రైతులను, కౌలుదార్లను ఆదుకొని ప్రభుత్వం తన రైతు పక్షపాతాన్ని నిరూపించుకోవాలి.

మహనీయుల మాట

చదువు మనిషిని
పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది.
చర్చ సంసిద్ధ మానవుడిగా
తీర్చిదిద్దుతుంది.
రాత కచ్చితమైన మానవునిగా
తీర్చిదిద్దుతుంది.

- ఫ్రాన్సిస్ బేకన్,
బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

ఆర్థిక వృద్ధి ఎగుమతులపై ఆధారపడితే వచ్చే చిక్కులు

ప్రభాత్ పట్నాయక్

దేశ ఎగుమతులను పెంచి తద్వారా ఆర్థికవృద్ధి సాధించడం అనే వ్యూహంపై ఆర్థికవేత్తల నడుమ గత ఏభై ఏళ్ళుగా చర్చ నడుస్తూనే వుంది. తూర్పు ఆసియా 'పులులు' సాధించిన 'అద్భుతాల'ను భారతదేశం వంటి నత్త నడకన వృద్ధి సాధిస్తున్న దేశాలతో పోల్చి 'ముడుచుకు పోయే' అభివృద్ధి వ్యూహం అనుసరించడమే మన వృద్ధి రేటు పెరగకపోవడానికి కారణం అని ప్రపంచబ్యాంక్ వ్యాఖ్యానించింది. ఈ మొత్తం చర్చలో వాస్తవ జీవితానికి సంబంధించి కీలక పాత్ర పోషించే ఒక విషయాన్ని మాత్రం విస్మరించారు.

ఒక ఆర్థిక వ్యవస్థలో స్థూల డిమాండ్‌లో భాగంగా ఉండే వివిధ ఖర్చులలో కొన్ని పద్దులు స్వయంప్రతిపత్తితో ఉంటాయి. తక్కిన ఖర్చులు మొత్తం డిమాండ్ ఏ మేరకు పెరిగితే ఆ మేరకు అవి కూడా పెరుగుతాయి. ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం స్వయంప్రతిపత్తి కలిగిన ఖర్చులు (ఎగుమతుల ఖర్చు అంటే ఎగుమతి చేసే సరుకులను ఉత్పత్తి చేయడం కోసం చేసే ఖర్చు. ఇది మన దేశానికి వెలుపల ఉండే డిమాండ్ బట్టి ఉంటుంది తప్ప మన దేశపు డిమాండ్ మీద కాదు). సరుకుల వినిమయం కోసం చేసే ఖర్చు వినిమయదారుల ఆదాయాల మీద ఆధారపడి వుంటుంది. ఐతే, కొన్ని సందర్భాలలో ఆదాయాలతో నిమిత్తం లేకుండా కూడా వినిమయ ఖర్చు ఉంటుంది. ఉదాహరణకు ఇంతవరకూ వినియోగదారులకు మార్కెట్‌లో లభించని ఏదైనా వస్తువు ఇప్పుడు మార్కెట్‌లో ఒక్కసారి లభిస్తు వుంటే, దానిని కొనుగోలు చేయడానికి అందరూ సిద్ధపడతారు.

ఒక ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌లో వృద్ధి, దానితోబాటు ఉత్పత్తిలో వృద్ధి స్వయంప్రతిపత్తి ఉన్న ఖర్చుల పెరుగుదల మీద ఆధారపడి వుంటుంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేసే ఆర్థిక వ్యవస్థలో దేశాల ఎల్లలను అధిగమించి ద్రవ్య పెట్టుబడి సంచరిస్తూ వుంటుంది. అందుచేత అది ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద అనేకరకాలుగా ఒత్తిడులు తెచ్చి తాను విధించే పరిమితులకు లోబడి వ్యవహరించాలని ఒప్పిస్తుంది. జిడిపిలో ఒకానొక పరిమితిని దాటి ద్రవ్యలోటు ఉండరాదు అన్నది అటువంటి ఒక షరతు. అప్పుడు ఆ దేశం తన ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను పెంచడం కోసం చేయగల ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోడానికి చిక్కులెదురౌతాయి. సంపన్నులపై విధించే పన్నులను పెంచి తద్వారా లభించే అదనపు ఆదాయంతో ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోవచ్చు. కాని అందువలన ద్రవ్యలోటు పెరుగుతుంది. ద్రవ్యలోటు ఒకానొక పరిమితికి మించరాదన్న షరతు ఉంది కనుక సంపన్నుల మీద విధించే పన్నులను పెంచగల శక్తిని ప్రభుత్వం కోల్పోతుంది. మరి డిమాండ్ పెంచడానికి, తద్వారా వృద్ధిరేటు పెంచడానికి ఎగుమతులను పెంచడం వినా మరో దారి లేదు. అందుచేత నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడి నడిచే వ్యవస్థగా ఉంటుంది.

ఐతే నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడకుండా కూడా ప్రభుత్వం తన ఎగుమతులను పెంచి తద్వారా వృద్ధి సాధించవచ్చు. అటువంటి వృద్ధి సాధించడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించి ఎగుమతులు పెరగడానికి తోడ్పడవచ్చు. చాలామంది తూర్పు ఆసియా దేశాల్లో జరిగిందిదే అని వాదిస్తారు.

ఎగుమతులను పెంచుకోవడం ద్వారా వృద్ధి సాధించడం అనే వ్యూహాన్ని అమలు చేసే దేశాల్లో రెండు రకాలు ఉంటాయి. ఆ తేడాను మనం చూడాలి. మొదటి కేసులో ఒకానొక దేశం ఒక పథకం ప్రకారం తన ఎగుమతులను పెంచుకుంటూ, విదేశీ వాణిజ్యంలో మిగులును క్రమంగా పెంచుకుంటూపోవచ్చు. తద్వారా తన విదేశీ మారక నిల్వలను పెంచుకుంటూ పోవచ్చు. ఇందుకు చైనా ఒక ప్రధాన ఉదాహరణ. అటువంటి దేశాల విషయంలో, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏవైనా ప్రతికూల మార్పులు చోటు చేసుకున్నా, వాటి ప్రభావం ఆ విదేశీ వ్యాపారం ద్వారా సమకూరిన నిల్వలు తగ్గడం వరకే పరిమితంగా ఉంటుంది. అందుచేత అటువంటి దేశాలు ఆ ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులను తట్టుకుని తేలికగానే బైటపడగలుగుతాయి.

ఐతే, చాలా దేశాలు రెండో కోవకు చెందుతాయి. అవి నిరంతరం విదేశీ వ్యాపారంలో లోటును కలిగివుంటాయి. ఆ లోటును భర్తీ చేయడానికి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం మీద ఆధారపడతాయి. ఒకవేళ విదేశీ మారకద్రవ్య నిల్వలలో మిగులును ఎప్పుడైనా సాధించినా, అందుకోసం అవి ప్రైవేటు రుణదాతల నుండి రుణాలు తీసుకుంటాయి. మన దేశం ఈ కోవకే చెందుతుంది. దక్షిణాసియా దేశాలన్నీ దాదాపు ఇదే కోవలో ఉంటాయి. మూడో ప్రపంచ దేశాల్లో చాలా దేశాలు కూడా ఇదే కోవలో ఉంటాయి.

ఇటువంటి దేశాల విషయంలో విదేశీ వ్యాపార ఖాతాలో లోటు రకరకాల బాహ్య కారణాల వలన పెరగవచ్చు. కరోనా కాలంలో టూరిస్టుల రాక తగ్గిపోయినందువలన శ్రీలంకలో విదేశీ మారక ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దిగుమతుల ధరలు పెరిగిపోవడం, ప్రపంచవ్యాప్త మాంద్యం కారణంగా ఎగుమతులకు ధరలు పడిపోవడం జరిగి బంగ్లాదేశ్ చిక్కుల్లో పడింది. అటువంటప్పుడు ఆ దేశానికి పెట్టుబడులను పంపించేవారు, ముఖ్యంగా రుణదాతలు వెనుకాడతారు. దాని వలన ఆ దేశపు చిక్కులు మరింత ఎక్కువ అవుతాయి. విదేశీ వ్యాపార లోటు మరింత పెరిగిపోతుంది. అప్పుడు దేశంలో ఉన్న ఆ కాస్త విదేశీ పెట్టుబడులు కూడా బైటకు ప్రవహించనారంభిస్తాయి.

పెట్టుబడులు పెట్టిన, లేదా రుణాలు ఇచ్చిన ప్రైవేటు పెట్టుబడిదారులు విదేశీ వ్యాపార లోటు పెరుగుతూంటే దాని వలన మన దేశ కరెన్సీ విలువ తగ్గుతుంది అని అంచనా వేస్తారు. అప్పుడు వారి పెట్టుబడులకు లభించే ప్రతిఫలం విలువ తగ్గిపోతుంది. అందుచేత తమ పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. అందువల్ల విదేశీ మారక ద్రవ్య లభ్యత మరింత పెద్ద సమస్యగా అయిపోతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా మొత్తం మార్కెట్ శక్తులకే విడిచిపెడితే విదేశీ మారక నిల్వల విషయంలో ఎప్పటికైనా సమతూకం సాధించడం సాధ్యమేనా అన్నది సందేహమే. కాని అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాగానే ఆ దేశం ఐఎంఎఫ్ వద్దకు పోయి రుణం తీసుకుంటుంది. అప్పుడు ప్రైవేటు పెట్టుబడిదారులలో కొంత భరోసా ఏర్పడి వారి పెట్టుబడులను వెనక్కి తీసేసుకోకుండా కొనసాగిస్తారు. ఐతే తాను రుణం ఇవ్వడానికి ఐఎంఎఫ్ చాలా పెద్ద మూల్యం కోరుతుంది. సంక్షేమానికి చేసే ఖర్చులో కోతలు విధించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, దేశ ఆస్తులను ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని (దీనినే విజాతీయీకరణ అని ముద్దుగా అంటారు)–ఇలాంటి షరతులను విధిస్తుంది.

విదేశీ మారక నిల్వలలో లోటు పెరగగానే ప్రైవేటు మదుపుదారులు హడావుడి పడిపోయి తమ పెట్టుబడులను వెనక్కి తీసేసుకోవడం వలన ఆ లోటు భారీగా పెరిగిపోవడం అనేది ఒక స్వల్పకాల వ్యవధిలో జరిగే పరిణామం. ఆ దెబ్బకి దేశం ఐఎంఎఫ్ ఉక్కు పిడికిలి లోకి వెళ్ళిపోతుంది. అంతవరకూ 'అద్భుతాలను' చూపించిన దేశాలు కాస్తా ఒక్కసారి 'బిచ్చగాళ్ళు'గా దిగజారిపోయినది ఇందుకే. కేవలం ఎగుమతులపైనే ఆధారపడి ఆర్థికవృద్ధి సాధించాలనే వ్యూహంతో ఎదురయ్యే చిక్కులు ఇవే. ఒకసారి ఆ వ్యూహంతో మన దేశం గనుక అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దురాశాపూరిత కాంక్షల వలలో పడితే ఇక మన గతి అంతే.

ఈ పరిస్థితి మన ఇరుగు పొరుగు దేశాలలో తలెత్తడం మనం చూస్తున్నాం. బంగ్లాదేశ్, శ్రీలంక ఒకానొక దశలో మానవాభివృద్ధి సూచికలలో మనతో పోల్చుకున్నప్పుడు చాలా పురోగతిని కనపరిచాయి. కాని ఇప్పుడు 'బిచ్చగాళ్ళ' స్థితికి వచ్చాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కొనసాగుతున్నప్పుడు పలు మూడవ ప్రపంచ దేశాల ఎగుమతులు దెబ్బ తింటాయి. అప్పుడు 'బిచ్చగాళ్ళు'గా దిగజారే దేశాల జాబితా పెరిగిపోతుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థ సైజు పెద్దది అయివుండొచ్చు. మన విదేశీ మారక నిల్వలు భారీగానే ఉండివుండవచ్చు (నిజానికి ఆ నిల్వలలో ఎక్కువ భాగం విదేశీ వ్యాపారంలోని మిగులు వలన ఏర్పడినవి కావు, ప్రైవేటు పెట్టుబడులు, రుణాల ద్వారా ఏర్పడినవే). అయినా, మన దేశం ఈ ప్రమాదానికి అతీతం ఏమీ కాదు. ఒకే ఒక్క ఊరట కలిగించే అంశం ఏమంటే మన ఆహార ధాన్య నిల్వల స్వయంసమృద్ధి (అది కూడా తలసరి వినియోగం పడిపోయినందువలన). ఇక ప్రస్తుత అంతర్జాతీయ సంబంధాల నేపథ్యంలో ఒకవైపు ఆంక్షలు ఉన్నా మనని రష్యా వంటి ఆంక్షలకు గురైన దేశాల నుండి దిగుమతులు తెచ్చుకోడానికి సామ్రాజ్యవాదులు అభ్యంతరాలు పెట్టడం లేదు. నిజానికి రైతులు గనుక మోడీ నల్ల వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టనట్టైతే, మన ఆహార స్వయం సమృద్ధి కాస్తా ముప్పులో పడివుండేది. ఆ ముప్పు మన దేశానికి తప్పించినందుకు మనం ఆ రైతులకు ధన్యవాదాలు చెప్పాలి.

ఒక దేశం నుండి ద్రవ్య పెట్టుబడులు బైటకు పోడానికి ఒక్క అంతర్జాతీయ వాణిజ్య పరిస్థితులే కారణం కానక్కరలేదు. ఒక దేశంలో పాలక పార్టీ ఓడిపోయి మరొకటి వచ్చిందనుకోండి. లేదా ఒక దేశంలోని మంత్రివర్గ పొందిక మారిందనుకోండి. అటువంటి సందర్భాలు కూడా ఒక్కోసారి ద్రవ్య పెట్టుబడులు బైటకు పోవడానికి కారణం అవుతాయి. అటువంటిది జరిగినప్పుడు ఆ దేశపు కరెన్సీ మారక విలువ తగ్గిపోతుంది. దానితో ఆ ప్రైవేటు పెట్టుబడులు మరింత ఎక్కువగా బైటకు పోతాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రవాహ వలయంలోకి ఒకసారి దేశం ప్రవేశించాక ఇటువంటి ప్రమాదాలకు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ గురవుతుంది. ఎగుమతుల పెంపు ద్వారా వృద్ధి సాధించాలనుకుంటే ఆ వలయం లోకి ప్రవేశించకా తప్పదు, ప్రమాదాలకు గురికాకనూ తప్పదు. పోనీ దిగుమతులను తగ్గించుకుందామా అంటే, ఒకసారి అంతర్జాతీయ మార్కెట్‌తో ముడిపడ్డాక దిగుమతులను కుదించుకుంటే ఎగుమతులను పెంచే పోటీలో వెనుకబడిపోతాం.

ఇటీవల అర్జెంటీనా దేశానికి మితవాద రాజకీయవేత్త జేవియర్ మిల్లర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ దేశాన్ని తీవ్ర స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం (150 శాతం) దెబ్బ తీసింది. గత ప్రభుత్వం (పెరొన్ ప్రభుత్వం) ఈ తీవ్ర స్థాయి ద్రవ్యోల్బణానికి కారణం అని ప్రజలు భావించారు. మితవాద మీడియా యావత్తూ పెరొన్ ప్రభుత్వపు విధానాలను ఏకి పారేయడమే గాక ఆ విధానాలు వామపక్ష విధానాలయినందువల్లనే ఆ పరిస్థితి దాపురించిందంటూ ప్రచారం అందుకున్నాయి. కాని అంతకన్నా సత్యదూరమైనది ఇంకొకటి లేదు. వాస్తవానికి ఆ దుస్థితికి పెరొన్ ప్రభుత్వ వామపక్ష విధానాలు కారణం కాదు. అర్జెంటినా లోని బడా ధనవంతులంతా తమ పెట్టుబడులను బైటకు తరలించుకుపోవడం అసలు కారణం. అలా తరలించడంతో కరెన్సీ మారకవిలువ పడిపోయి ద్రవ్యోల్బణానికి దారి తీసింది. ఇప్పుడు మరో ప్రభుత్వం అక్కడ వచ్చింది. ఈ ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దేందుకు ఐఎంఎఫ్ రుణం తీసుకుని దేశాన్ని నయా ఉదారవాద సంకెళ్ళతో కట్టిపడేయవచ్చు. కాని ఆ రుణం తిరిగి చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు మళ్ళీ విదేశీ చెల్లింపుల్లో లోటు తలెత్తవచ్చునన్న ముందస్తు అంచనాతో మళ్ళీ పెట్టుబడులు బైటకు భారీగా తరలిపోతాయి. అప్పుడు చెల్లింపుల లోటు మరింత పెరుగుతుంది. ద్రవ్యోల్బణం మళ్ళీ విజృంభిస్తుంది.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో ఎగుమతులను పెంచడం ద్వారా వృద్ధి అనే వ్యూహాన్ని అమలు చేశారు. ఆ కాలంలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయి వుంది. ఆ సమయంలో మూడవ ప్రపంచ దేశాలలో దిగుమతులకు ప్రత్యామ్నాయాలను రూపొందించుకునే విధానాలు చేపట్టారు. దాంతో ఎగుమతును పెంచుకోవడం అనే వ్యూహం పూర్తిగా దెబ్బ తినిపోయింది. దెబ్బ తిన్న ఆ విధానమే ఇప్పుడు మళ్ళీ, మరొక ప్రపంచ ఆర్థిక సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో నయా ఉదారవాద వ్యవస్థ ద్వారా మన ముందుకు వచ్చింది. అందుచేత ఆ విధానాన్ని తిరస్కరించాలనే చర్చ కూడా ఇప్పుడు మన ఎజెండాలో చేరింది.

(స్వేచ్ఛానుసరణ)

> ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా మొత్తం మార్కెట్ శక్తులకే విడిచిపెడితే విదేశీ మారక నిల్వల విషయంలో ఎప్పటికైనా సమతూకం సాధించడం సాధ్యమేనా అన్నది సందేహమే. కాని అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాగానే ఆ దేశం ఐఎంఎఫ్ వద్దకు పోయి రుణం తీసుకుంటుంది. అప్పుడు ప్రైవేటు పెట్టుబడిదారులలో కొంత భరోసా ఏర్పడి వారి పెట్టుబడులను వెనక్కి తీసేసుకోకుండా కొనసాగిస్తారు. ఐతే తాను రుణం ఇవ్వడానికి ఐఎంఎఫ్ చాలా పెద్ద మూల్యం కోరుతుంది. సంక్షేమానికి చేసే ఖర్చులో కోతలు విధించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, దేశ ఆస్తులను ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని (దీనినే విజాతీయీకరణ అని ముద్దుగా అంటారు)-ఇలాంటి షరతులను విధిస్తుంది.

జాతీయవాదం : గాడ్సే-సావర్కర్ అండ్ కో వక్రభాష్యం

విశ్లేషణ



రామ్ పునియానీ

> గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యతను అంగీకరించే దేశం గురించి కలలుగంటుండగా... సావర్కర్ - గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం గతమంతా ఘనమైనదని, అన్నీ పురాణాలు-వేదాల్లోనే వున్నాయని అదేపనిగా మాట్లాడారు. వారి వారసులు ఇప్పటికీ మాట్లాడుతూనే వున్నారు. వాస్తవానికి వారు చెప్తున్న గతంలో అసమానతలనేవి పుట్టుక ఆధారంగా అంతర్నిర్మితంగా ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి. వారి ఆలోచనలు మాత్రం ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు.

ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ చెప్పినట్లు, ప్రతి జాతీయవాదం తన సొంత చరిత్రను నిర్మించుకుంటుంది. అలాగే ప్రతీ జాతీయవాదం తన భావజాలానికి అనుగుణంగా తన సొంత యోధులను సృష్టించుకుంటుంది. ఆ క్రమంలో ఆ యోధులు అనుసరించిన మార్గాన్ని వ్యతిరేకించిన వారిని కూడా అపకీర్తిపాలు చేస్తారు.

ఇందుకుగాను పరిపూర్ణతతో కూడిన నైపుణ్యం కలిగిన రెండు వ్యూహాలు అవసరం. ఒకటి, తాము ప్రోత్సహించాలని భావించిన యోధులను సమర్థించడం. రెండు, ప్రత్యర్థి నాయకుల గురించి ప్రతికూలంగా విస్తృత ప్రచారం చేయడం. ఇదే ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్నది. ఒకవైపు మితవాద నాయకుడైన నాథూరామ్ గాడ్సే గురించి స్తుతిస్తూనే మరోవైపు మహాత్మా గాంధీ గురించిన ప్రతికూలమైన అంశాలను ప్రచారం చేస్తున్నారు.

గాడ్సే కోసం దేవాలయాలు నిర్మించాలనే డిమాండ్లు నిరంతరం ఉంటూనే ఉన్నాయి. 'గాడ్సే గతంలో, ఇప్పుడు, భవిష్యత్తులో కూడా దేశభక్తుడే' అని మాలేగావ్ బాంబు దాడి నిందితురాలు, ప్రస్తుత పార్లమెంట్ సభ్యురాలు ప్రజ్ఞా ఠాకూర్ వాదిస్తూనే వున్నారు. గాడ్సే గురువు, సలహాదారు, హిందూత్వ స్థాపకుడైన వినాయక దామోదర్ సావర్కర్ చిత్రపటం ఇప్పటికే లోక్‌సభలో వేలాడుతోంది. ఇప్పుడు ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ కూడా చేస్తున్నారు.

గాడ్సే చేతిలో హత్యగావించబడిన గాంధీని ప్రతికూలమైన వ్యక్తిగా చూపించే ప్రయత్నంలో ఆయన హత్యకు సంబంధించిన వాస్తవాలను కూడా చెరిపివేస్తున్నారు. ఇప్పటికే ఆ వాస్తవాలు చాలా పాఠ్యపుస్తకాల్లో లేకుండా పోయాయి. ఇటీవలి కాలంలో గాంధీజీ ఆత్మహత్య చేసుకున్నాడనే తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే ప్రయత్నాలు కూడా ఊపందుకున్నాయి. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన తొమ్మిదవ తరగతి పరీక్షలో ఒక ప్రశ్న రూపంలో ఆ తప్పుడు వార్త ప్రతిబింబించింది. "గాంధీ ఆత్మహత్యకు ఎలా పాల్పడ్డాడు?" అన్నది ఆ ప్రశ్న. దేశ విభజనకు ఆయనే కారణమనీ, ఆయన వల్లే పాకిస్తాన్‌కు రూ. 55 కోట్లు ఇవ్వాల్సి వచ్చిందనీ, ఆయన హిందూ వ్యతిరేకి అనీ, ముస్లింలను తృప్తిపరిచినందుకే ఆయన హత్య చేయబడ్డాడనే ప్రచారం ఇప్పటి దాకా సాగింది.

మధ్యప్రదేశ్ లోని భోపాల్ నుండి పోటీ చేయడానికి టికెట్ ఇచ్చిన తన పార్టీ బిజెపిని కాపాడేందుకు గాడ్సేని దేశభక్తునిగా స్తుతించినప్పటికీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆ తరువాత క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో గాంధీజీని అపఖ్యాతి పాలు చేయడానికి, అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను కొన్నింటిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని వాటిని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు.

ఈ అసంబద్ధమైన మాటలు, అనేక ప్రయత్నాలు, గాడ్సేను కీర్తించడానికి, అతడు గాంధీని హత్య చేయడాన్ని సమర్థించేందుకు ఉద్దేశించినవిగా ఉన్నాయి. కానీ గాడ్సే ఎవరు? ఆయన తన రాజకీయ జీవిత గమనాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్‌గా ప్రారంభించి, ఆ తరువాత సావర్కర్ నాయకత్వంలోని హిందూ మహాసభలో చేరాడు. హిందూత్వ శక్తుల ప్రయత్నాలు... గాంధీజీ అభిప్రాయాలను వివరించేందుకు కాకుండా, ఆయన చేసిన పనుల్లో దొర్లిన చిన్న చిన్న తప్పుల్ని వెతికేందుకు ఉద్దేశించబడుతున్నాయి. గాంధీని తప్పుడు వ్యక్తిగా చిత్రీకరించేందుకు, ఆయనకు ఇతర జాతీయ నాయకుల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను గోరంతలను కొండంతలు చేసి చెప్పాలనుకుంటున్నారు. గాంధీ, అంబేద్కర్‌కు వ్యతిరేకం అని తెలిపే పూణే ఒప్పందం ఒక ప్రధానమైన అంశంగా మారింది. ఈ ఒప్పందంపై ఇద్దరు నాయకులూ సంతకాలు చేశారు. కానీ అణగారిన వర్గాల వారి రాజకీయ, సామాజిక భవిష్యత్తుకు సంబంధించిన నిబంధనలపై వారిరువురికీ ఏకాభిప్రాయం కుదరలేదు.

అవును గాంధీ, అంబేద్కర్‌లు విభేదించుకున్నారు. కానీ వారి విభేదం వ్యూహాత్మక స్థాయిలో ఉంది. ఉదాహరణకు "ప్రత్యేక ఓటర్ల" విధానం భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాట ఐక్యతను బలహీనపరుస్తుందని గాంధీజీ విశ్వసించాడు. అంటరానితనాన్ని అంతం చెయ్యాలని ఆయన నొక్కి వక్కాణించాడు. రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరచడానికిగాను ఆయన నియోజక వర్గాల రిజర్వేషన్లపై పట్టు పట్టాడు. కానీ మతం, జాతి, వర్గంతో నిమిత్తం లేకుండా భారతీయులందరినీ తన వెంట తీసుకెళ్ళాల్సి వస్తుందని, వలసవాద వ్యతిరేక ఉద్యమ నాయకునిగా గాంధీజీ విశ్వసించాడు.

స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించే మార్గాల గురించి కూడా ఆయన చాలా స్పష్టంగా ఉన్నాడు. ఈ కారణంగానే భగత్ సింగ్, అతని అనుచరుల పట్ల గౌరవం ఉన్నప్పటికీ ఆయన క్షమాభిక్ష కోసం కేసుపై పట్టు పట్టలేదు. గొప్ప జాతీయవాది అయిన భగత్ సింగ్ కూడా నైతిక కారణలతో క్షమాభిక్ష కోరలేదు.

భారత స్వాతంత్ర్యోద్యమం ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి ఉన్నది. వలసవాద వ్యతిరేక ఉద్యమాన్ని ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమంగా మార్చిన నేత గాంధీ. ఒకానొక మజిలీ తరువాత, గాంధీ వ్యూహానికి ఏ మాత్రం పొంతన లేని విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. స్వాతంత్ర్యానికి చేరువలో వున్న వేళ కాంగ్రెస్‌లో నిర్ణయాలు చేసింది కూడా నెహ్రూ, సర్దార్ పటేల్, ఇంకా ఇతర ముఖ్య నాయకులే. అన్ని నిర్ణయాలు గాంధీ ఇష్టానికి అనుగుణంగా కూడా జరగలేదు. ఉదాహరణకు, గాంధీ దేశ విభజనను అంగీకరించలేదు. ఇతరులకు అనుకూలంగా ఉన్న ఆర్థిక విధానాలతో కూడా ఏకీభవించ లేదు. గాంధీకి ఉన్నతమైన నైతిక అధికారత ఉన్నప్పటికీ, తన శిష్యులైన నెహ్రూ, పటేల్‌లు ఆయన వ్యూహాలకు భిన్నమైన వాటిని స్వీకరించారు. "నా మాటకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో విలువ లేకుండా పోయింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల పట్ల నేను సంతృప్తికరంగా లేను. వాటిని నేను బైటికి మాట్లాడలేకపోతున్నాను" అని గాంధీ ఒక సందర్భంలో అన్నారు.

ఈ కోణంలో చూసినప్పుడు, అంబేద్కర్–గాంధీల మధ్య స్వల్పమైన భేదం ఉంది. గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో చాలా పెద్ద నాయకుడే కానీ, నియంత కాదు. ఆ విధంగా, ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాల కంటే ఏకీభావమే ఎక్కువ అనే వాస్తవాన్ని చరిత్ర ధ్రువీకరిస్తుంది. ప్రజాస్వామిక ప్రాథమిక మార్గదర్శక సూత్రాలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి అనేక లోతైన విషయాలపై వీరిరువురూ ఒకే మార్గంలో ఉన్నారు.

గాడ్సే చెప్పిందే సరైనదని నిరూపించడానికి, (మరణానంతరం, చాలా కాలం తర్వాత భిన్నాభిప్రాయాలలో కొన్నింటిని తీసుకొని వారి మధ్య ఉన్న) భేదాభిప్రాయాలను అతిశయోక్తిగా చెప్పేందుకు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక ఉద్యమాలకు భిన్నాభిప్రాయాలే ప్రాణం. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే... గాడ్సే, సావర్కర్‌లు జాతీయవాద భావనల విషయంలో అంబేద్కర్, గాంధీ, కాంగ్రెస్, ఇతర స్వాతంత్ర్యోద్యమ నాయకులకు భిన్నంగా ఉంటారు.

గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యతను అంగీకరించే దేశం గురించి కలలుగంటుండగా, సావర్కర్ – గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం గతమంతా ఘనమైనదని, అన్నీ పురాణాలు–వేదాల్లోనే వున్నాయని అదేపనిగా మాట్లాడారు. వారి వారసులు ఇప్పటికీ మాట్లాడుతూనే వున్నారు. వాస్తవానికి వారు చెప్తున్న గతంలో అసమానతలనేవి పుట్టుక ఆధారంగా అంతర్నిర్మితంగా ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దృఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి. వారి ఆలోచనలు మాత్రం ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు. తమకు భిన్నంగా ఉన్నవారిపై తమ ఇష్టాయిష్టాలను రుద్దేందుకు పరాయివారనే ముద్ర వేస్తారు.

హిందూ జాతీయవాదులు ఏ భావజాలం కోసమైతే ఉన్నారో, ఆ భావజాలం కోసమే ప్రజ్ఞా ఠాకూర్ నిలబడుతున్నారు. అయితే దీనిని వారు స్పష్టం చేయదలచుకోవడం లేదు. తమ కార్యక్రమాలన్నింట్లోనూ గాడ్సే ప్రాతినిధ్యం వహించే భావజాలానికి అనుకూలంగా మాట్లాడుతూ, కీర్తించేందుకు ప్రయత్నిస్తుంటారు.

('కౌంటర్ కరెంట్స్' సౌజన్యంతో)

దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన 21.9 కోట్ల ప్రజలు

- గ్రామాల పరిస్థితి విషమం
- ఉపాధి కల్పనతోనే పేదరికం నుంచి బయటకు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 21.9 కోట్ల ప్రజలు ఇప్పటికీ దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని కేంద్ర గణాంకాలు, ప్రోగ్రామ్ అమలు మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ పార్లమెంటుకు తెలిపారు. బహుమితీయ పేదరికానికి సంబంధించి నగరాలు, గ్రామాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. ఉచిత రేషన్ పంపిణీని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ప్రసంగాల్లో తరచూ ప్రస్తావిస్తూ, దానిని ఒక ఘనకార్యంగా ప్రస్తావిస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ రేషన్ పంపిణీ ఆవశ్యకతను అర్థం చేసుకోవాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే అందజేస్తున్నట్లు చెబుతున్నారు. నిజానికి ఈ రోజు కూడా మన దేశంలో తమ ఆహార అవసరాలు తీర్చుకోలేని పేదల పెద్ద సంఖ్యలో ఉన్నారని స్పష్టం అవుతుంది. అందుకోసమే ప్రభుత్వ పథకాలు అవసరాన్ని దుర్భిక్ష పరిస్థితి నొక్కి చెబుతుంది. పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సమర్పించిన పేదరిక గణాంకాల ప్రకారం, నేటికీ దేశంలో 21.9 కోట్ల ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. దేశంలో పేదరికం ఎంత ఉందో తెలుసుకోవడానికి 2011-12లో సర్వే నిర్వహించడానికి, ఆ తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి అంచనా వేయలేదని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సర్వేలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 27 కోట్లుగా అంచనా వేయబడింది. ఇప్పుడు దారిద్ర్య రేఖ ప్యానెల్ ఎలా నిర్ణయిస్తారనే ప్రశ్న తలెత్తుతుంది.

ఒక గ్రామంలో నివసించే వ్యక్తి ప్రతిరోజూ రూ.26 ఖర్చు చేయలేకపోతే, నగరంలో నివసించే వ్యక్తి రూ.32 ఖర్చు చేయలేకపోతే, ఆ వ్యక్తి దారిద్ర్య రేఖకు దిగువన పరిగణించబడతారని ప్రభుత్వం విశ్వసిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబం వారి పిల్లలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోతుంది. వారి పిల్లలకు సరైన విద్యను అందించలేకపోతుంది. ఆరోగ్యం, సమతుల్య ఆహారం అందించలేకపోతుంది. కరోనా కాలంలో పేదరికంలో మగ్గుతున్న ప్రజల ఆర్థిక పరిస్థితి అప్పులు పాలు చేసి కుటుంబాన్ని పోషించే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వారి పిల్లల చదువులు దెబ్బతినడం కాకుండా సరైన తిండి దొరక్క ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమయంలో అట్టడుగు వర్గాలు, వారి కుటుంబాలు చాలా కష్టాలను ఎదుర్కొన్నాయి. కోవిడ్ ముగిసిన తరువాత కొంతకాలం ఉపాధి సమస్యను ఎదుర్కొన్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) లాక్‌డౌన్ తరువాత కొత్త డేటాను విడుదల చేసింది. నిరుద్యోగిత రేటు మే 2022లో 7.1 శాతం నుండి జూన్ 2022లో 7.8 శాతానికి పెరిగిందని, ఇందులో గ్రామీణ భారతదేశంలో నిరుద్యోగిత రేటు 1.4 శాతం పెరిగిందని పేర్కొంది.

నీతి ఆయోగ్ నివేదిక ఏం చెబుతోంది?

ప్రభుత్వ డేటా ప్రకారం, నీతి ఆయోగ్ నేషనల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ రివ్యూ 2023' పేరుతో ఒక నివేదికను సమర్పించింది. దీని ప్రకారం 2015-16 నుండి 2019-21 సంవత్సరాల్లో 13.5 కోట్ల మంది బహుమితీయ పేదరికం నుండి విముక్తి పొందారు. నీతి ఆయోగ్ నేషనల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ రెండో ఎడిషన్‌ను విడుదల చేసింది. దీని మొదటి ఎడిషన్ నవంబరు 2021లో విడుదల చేసింది.

దేశంలో బహుమితీయ పేదల సంఖ్య ఎంత?

దేశంలో 2015-16లో 24.85 శాతం జనాభా బహుమితీయ పేదరికంలో ఉన్నారు. ఇది 2019-21 నాటికి 14.96 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, దేశ జనాభాలో 15 శాతం మంది ఇప్పటికీ బహుమితీయ పేదరికంలో జీవిస్తున్నారని నిర్ధారించబడింది. ఈ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఇప్పుడు మనం ఈ బహుమితీయ పేదరికానికి సంబంధించిన నగరాలు, గ్రామాలను పోల్చినట్లయితే, పేదరికంలో గ్రామాలు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో పేదరికం 8.65 శాతం నుండి 5.27 శాతానికి తగ్గగా, గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 32.59 శాతం నుండి 19.28 శాతానికి తగ్గింది. అయితే, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఈ వ్యత్యాసంపై నీతి ఆయోగ్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. రేషన్ పంపిణీ చేయడంతో పేదలను పేదలుగా ఉంచడానికి సరిపోతుంది. ప్రభుత్వాలు రేషన్‌కు బదులుగా ఉద్యోగాలు, లేదా రేషన్‌తోపాటు ఉద్యోగాల వాగ్దానాలను అమలు చేయాలి. ప్రజలకు ఉపాధి కల్పించాలి.

అప్పుడు పేదరికం తగ్గుతుంది. 2018-19 నుంచి 2023-24 వరకు 1,06,561 కంపెనీలు ఏదో ఒక కారణంతో మూసివేయబడ్డాయని కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ స్వయంగా లోక్‌సభలో ఈ సమాచారాన్ని తెలియజేశారు. కంపెనీలు చాలా సందర్భాల్లో మూసివేతకు 6 నుండి 8 నెలల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ సమయం 12 నుండి 18 నెలలకు చేరుకుంది. ఏదేమైనప్పటికీ, పేదరికానికి అతిపెద్ద కారణం ప్రజలకు ఉపాధి లేకపోవడమని ఎవరూ కాదనలేరు. దీనిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. ఉపాధి కల్పించడంతోనే దేశంలోని కుటుంబాలు పేదరికం నుంచి బయటపడతాయి.

ఉల్లి ఎగుమతులపై నిషేధానికి వ్యతిరేకంగా నాసిక్ రైతుల ఆందోళన

నాసిక్ : ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆకస్మిక నిషేధానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో రైతులు రోడ్లపైకి వచ్చారు. ప్రహార్ జనశక్తి పార్టీ నేతృత్వంలో ఆందోళన చేసిన రైతులకు సిపిఎం, కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన (యుబిటి), వివిధ రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ముందుగా స్థానిక ఎంపి, కేంద్ర సహాయ మంత్రి భారతీ పవార్ నివాసం వద్ద ఆందోళన చేయాలని రైతులు భావించగా, పోలీసులు వీరిని అడ్డుకున్నారు. దీంతో అశోక్ స్థంభ్, ముంబయి - ఆగ్రా జాతీయ రహదారి కూడలి, వంటి ప్రాంతాల్లో రైతులు ఆందోళన చేశారు. రహదారులను దిగ్బంధించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైతుల ఆందోళనతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. మరోవైపు రైతులకు నచ్చజెప్పడానికి డిప్యూటీ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ (డిడిఆర్) ఫైయాజ్ ములానీ ప్రయత్నించారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కారణంగా భారతీ పవార్ తన నివాసంలో లేరని, నిషేధం ఉపసంహరించుకోవడంపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని చాంద్‌వాడ్ గ్రామంలో జరిగిన రైతుల ఆందోళనలో ఎన్‌సిపి అధ్యక్షులు శరద్ పవార్ పాల్గొన్నారు. ఇప్పటికే అకాల వర్షాలు కారణంగా రైతులు భారీగా నష్టపోయారని, ఉల్లి ఎగుమతులపై నిషేధం వారి కష్టాలను మరింతగా పెంచుతుందని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఉందని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు మరో మూడు వేల కోట్లు

- కేంద్రం ప్రతిపాదన
- ఐదు వేల కోట్లు దాటనున్న వ్యయం

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, ఇవిఎంల కోసం మరో రూ.3,147.92 కోట్లు అవసరమవుతాయని కేంద్రం భావిస్తోంది. ఈ వ్యయానికి సంబంధించి పార్లమెంట్ అనుమతి కోరింది. తాజా ప్రతిపాదనతో లోక్‌సభ ఎన్నికల వ్యయం ఐదు వేల కోట్ల రూపాయలు దాటనుంది.

- కేరళ ఆర్థిక సంక్షోభంపై థామస్ ఐజాక్

తిరువనంతపురం : కేరళ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం కేంద్రం కృత్రిమంగా సృష్టించిందేనని కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ విమర్శించారు. గత ఏడు సంవత్సరాల నుండి బడ్జెట్ రుణ మొత్తాలను తగ్గించడం ద్వారా ఈ పరిస్థితికి తీసుకువచ్చిందని చెప్పారు. ఈనాడు కేంద్రం తన ఏజెంట్ అయిన గవర్నర్‌ని ఉపయోగించి కేరళలో ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తామంటూ బెదిరిస్తోందన్నారు. బిజెపి నిప్పుతో చెలగాటమాడుతోందని ఆయన విమర్శించారు.

నేడు విచారణకు రండి

- జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్‌కు ఇడి సమన్లు

రాంచీ : భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ నెల 12న విచారణకు రావాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం సమన్లు జారీ చేసింది. రాంచీలో తమ కార్యాలయానికి హాజరుకావాలని, మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద వాంగ్మూలం నమోదు చేస్తామని తెలిపింది. సోరెన్‌కు ఇడి ఇలాంటి సమన్లు జారీ చేయడం ఇది ఆరోసారి. ఇడి నుంచి రక్షణ కల్పించాలని, ఇడి సమన్లు 'అవాంఛనీయం' అని ప్రకటించాలని జార్ఖండ్ హైకోర్టు, తరువాత సుప్రీంకోర్టును సోరెన్ ఆశ్రయించారు. సోరెన్ పిటిషన్‌ను రెండు కోర్టులు తిరస్కరించాయి. తనపై ద్వేష పూరితంగానూ, రాష్ట్రంలో రాజకీయ అనిశ్చిత, అశాంతి సృష్టించే లక్ష్యంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సోరెన్ కోర్టులకు తెలిపారు. ఆగస్టు 14న ఇడి తొలిసారిగా సోరెన్‌కు సమన్లు జారీ చేసింది. రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కులను అక్రమంగా మార్చడానికి కుట్ర జరుగుతోందని ఇడి ఆరోపిస్తోంది. ఈ కేసులో 2011 బ్యాచ్ ఐఎఎస్ అధికారి ఛవీ రంజన్‌తోసహా 14 మందిని ఇడి అరెస్టు చేసింది. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన మరో మనీలాండరింగ్ కేసులో గత ఏడాది నవంబర్‌లో సోరెన్‌ను ఇడి ప్రశ్నించింది.

గడిచిన మూడేళ్లలో రూ.7,295.35 కోట్లు ఇచ్చాం : కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్' కింద గడిచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,295.35 కోట్లు, తెలంగాణకు రూ.3,073 కోట్లు ఇచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. కోవిడ్-19 దృష్ట్యా మూలధన వ్యయంలో రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించే పథకాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేసినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా 50 ఏళ్లలో తిరిగి చెల్లించేలా వడ్డీ లేని రుణాన్ని సమకూర్చిందని తెలిపింది. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించి అంశాలపై ఎంపిలు గజానన్ కీర్తికర్, కృపాల్ బాలాజీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. కోవిడ్ దృష్ట్యా రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థికసాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్‌కు 2020-21లో రూ.688 కోట్లు, 2021-22లో 501.79 కోట్లు, 2022-23లో 6,105.56 కోట్లు కేంద్రం విడుదల చేసిందన్నారు.

దక్షిణ చైనా సముద్రంలోకి దూసుకొచ్చిన ఫిలిప్పైన్స్ నౌకలు

- కట్టడి చేసిన చైనా

బీజింగ్ : దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పైన్స్‌కి చెందిన నౌకలు చైనా హద్దును ఉల్లంఘించి, చైనా నౌక వైపునకు ఉద్దేశ్యపూర్వకంగా దూసుకురావడంతో చైనా తీర ప్రాంత రక్షక దళాలు (సిసిజి) ఆదివారం వాటిని నియంత్రించే చర్యలు తీసుకున్నాయి. చైనాతో కుదిరిన అవగాహనను ఫిలిప్పైన్స్ విచ్ఛిన్నం చేస్తోందని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతోందని పరిశీలకులు విమర్శిస్తున్నారు. ఫిలిప్పైన్స్ కవ్వింపు చర్యలకు అమెరికా ఆజ్యం పోస్తోందని విమర్శించారు. ఫిలిప్పైన్స్‌కి చెందిన రెండు తీర ప్రాంత రక్షక దళ నౌకలు చైనాకు చెందిన రీనాయ్ రీఫ్ వద్ద అక్రమంగా మోహరించిన యుద్ధ నౌకలోకి బిల్డింగ్ సామాగ్రిని డంప్ చేయడానికి ఆదివారం ప్రయత్నించాయి. వెంటనే చైనా చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కఠినమైన ఆంక్షలను అమలు చేసే చర్యలను తీసుకున్నట్లు చైనా తీర ప్రాంత రక్షక దళం (సిసిజి) ఆదివారం తెల్లవారు జామునే ఒక ప్రకటనలో తెలిపింది. చైనా నుండి తీవ్ర హెచ్చరికలు వెలువడినప్పటికీ ఫిలిప్పైన్ నౌక అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి, ఉదయం 6.39గంటల సమయంలో ప్రమాదకరమైన రీతిలో చైనా నౌక వైపు దూసుకురావడానికి ప్రయత్నించింది. దీంతో స్వల్పంగా రెండు నౌకలు ఢీ కొన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం రెండోసారి చైనా తీర ప్రాంత దళం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

బిజెపియేతర పాలిత రాష్ట్రాలకు
కేంద్రం నిధుల అడ్డగింతపై ప్రతిపక్షాల నిరసన

- రాజ్యసభ నుంచి ఇండియా ఫోరం ఎంపిల వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపియేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. ఆయా రాష్ట్రాలకు నిధులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఇండియా ఫోరం ఎంపిలు సోమవారం రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక దిగ్బంధనాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, టిఎంసి, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎస్‌పి, జెడియు, డిఎంకె, ఆర్‌జెడి, ఎన్‌సిపి, సిపిఎం, సిపిఐ, శివసేన (యుబిటి) తదితర ఇండియా ఫోరం పార్టీల ఎంపిలు సభను వాకౌట్ చేసి ఆందోళన చేపట్టారు. అలాగే పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందు సోమవారం ఇండియా ఫోరం నేతలు సమావేశం అయ్యారు. పార్లమెంటులోని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశం అయ్యారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల వ్యూహాన్ని రూపొందించారు. సమావేశంలో రాఘవ చడ్డా (ఆప్), ఎలమరం కరీం (సిపిఎం), బినయ్ విశ్వం (సిపిఐ), వందనా చౌహాన్ (ఎన్‌సిపి), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), డెరిక్ ఓబ్రెయిన్, సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), తిరుచ్చి శివ, టిఆర్ బాలు (డిఎంకె), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), మహువా మాంఝీ (జెఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభలో జమ్ము-కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు 2023, జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఈ రెండు బిల్లులపై జరిగిన చర్చలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. అనంతరం బిల్లులను ఆమోదించారు. మరోవైపు లోక్‌సభలో అనుబంధ డిమాండ్లు, గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. అయితే చర్చ జరిగినప్పుడు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, అధికార పార్టీ సభ్యులు లేకపోవడంపై ప్రతిపక్షాలు నిరసించాయి. టిఎంసి ఎంపి సౌగత్ రాయ్ మాట్లాడుతూ.. సభ మొత్తం ఎడారిలా కనిపిస్తోందని, ఇప్పుడు మాట్లాడటం వల్ల ఏమి ఉపయోగమని అన్నారు. 'అధికార పక్షం ఉండకపోతే మాట్లాడటం ఎందుకు?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జమ్ము కాశ్మీర్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం

- అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రతిపక్షాల వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ము కాశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లు, జమ్ము కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులను రాజ్యసభ ఆమోదించింది. లోక్‌సభ ఆమోదించిన జమ్ము కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, 2023, జమ్ము కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును సోమవారం రాజ్యసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. దీనిపై జరిగిన చర్చలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా సమాధానం తరువాత బిల్లులు ఆమోదించారు. కాంగ్రెస్, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఒబిసి వ్యతిరేకి అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం మూజువాణి ఓటుతో రెండు బిల్లులను ఆమోదించుకున్నారు. అమిత్ షా మాట్లాడుతూ.. ఆగస్టు 2019లో ఆర్టికల్ 370ను రద్దు చేసే రాష్ట్రపతి అధికారాన్ని సుప్రీంకోర్టు సమర్థించినప్పటి నుండి ఇది ఒక మైలురాయని అన్నారు. ఆర్టికల్ 370 తాత్కాలిక చర్య అని సుప్రీంకోర్టు గుర్తించిందని అన్నారు. తగిన సమయంలో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని, తాము పార్లమెంటులో చెప్పామని, సుప్రీంకోర్టు కూడా తీర్పులో తన వైఖరిని అంగీకరించిందని పేర్కొన్నారు. 'గుజరాత్, రాజస్థాన్‌లకు పాకిస్తాన్‌తో సరిహద్దులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, అస్సాం మొదలైన రాష్ట్రాల్లో కాశ్మీర్ కంటే ఎక్కువ మంది ముస్లిములు ఉన్నారు. వేర్పాటువాదం వెనుక కారణాలు ఇవే కాదు. ఆర్టికల్ 370. కాశ్మీర్‌లో వేర్పాటువాదం ఉగ్రవాదానికి దారితీసింది' అని ఆయన అన్నారు. 'జమ్ములో ఇప్పుడు 43 సీట్లు (37 నుండి), కాశ్మీర్‌లో ఇప్పుడు 47 సీట్లు (46 నుండి), పిఒకెలోని 24 సీట్లు రిజర్వ్‌లో చేశాం. ఎందుకంటే ఇది దేశంలో భాగమని మేము ఇప్పటికీ నమ్ముతున్నాము' అని అన్నారు. తమ ప్రభుత్వం స్థానికుల జీవితాలను మెరుగుపరిచిందని అన్నారు. యువత చేతుల్లో రాళ్లు పోయి, ల్యాప్‌టాప్‌లు వచ్చాయని తెలిపారు.

వైసిపి ఎంపి వి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టికల్ 370, పాకిస్తాన్‌తో రెండో యుద్ధంలో కాశ్మీర్‌ను తిరిగి పొందడంలో వైఫల్యం ముఖ్యమైన తప్పిదాలుగా పేర్కొన్నారు. పరిస్థితిని సరిదిద్దడానికి బంగ్లాదేశ్ యుద్ధం తరువాత సిమ్లా డిక్లరేషన్‌పై సంతకం చేసే సమయంలో అవకాశం కోల్పోయిందని ఆయన సూచించారు. ఎన్నికలు జరగని పిఒకెలోని 24 స్థానాలకు అక్కడి సభ్యులను నామినేట్ చేయాలని ప్రతిపాదించారు. వలసదారులకు నగదు ఉపశమనాన్ని పెంచాలని అభ్యర్థించారు.

కాశ్మీర్ భారతదేశంలో భాగం కావడానికి నెహ్రూ కారణమని కాంగ్రెస్ ఎంపి సయ్యద్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి.. నెహ్రూపై చేసిన వ్యాఖ్యలపై నాసిర్ హుస్సేన్ అభ్యంతరం తెలిపారు. విజయసాయిరెడ్డికి నెహ్రూ, పటేల్ దృక్కోణాలపై అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ ఎంపి వివేక్ తంఖా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో విద్యుత్ కొరతతో సహా అనేక సమస్యలు ఉన్నాయని, అక్కడి వ్యక్తులు కేంద్ర పాలిత ప్రాంత ప్రయోజనాలను పొందడం లేదని ఆయన తెలిపారు. జమ్ము కాశ్మీర్ సమస్యల గురించి కొంచెం ఆలోచించండి అని అన్నారు. కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ.. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదం నిర్మూలించబడిందా? అని ప్రశ్నించారు.

సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ.. జమ్ము కాశ్మీర్‌లో రాష్ట్ర హోదాను తొలగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఫెడరలిజం సూత్రాలకు విఘాతం కలిగిస్తోందని అన్నారు. ఈ ప్రాంతం స్వయంప్రతిపత్తి, దేశంలోని మొత్తం సమాఖ్య పాలనపై అటువంటి నిర్ణయం ప్రభావం గురించి అభ్యంతరాలను వ్యక్తం చేశారు. మీడియాను ప్రభుత్వం నియంత్రిస్తోందని మరో సిపిఎం ఎంపి వి శివదాసన్ అన్నారు. సిపిఐ ఎంపి పి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో బిజెపి స్వయం ప్రతిపత్తి రాజ్యాంగంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్ మాట్లాడుతూ.. మిలిటెన్సీ కాశ్మీర్ అందాన్ని తినేసే కేన్సర్ అని అన్నారు. డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పరిధిలో రాష్ట్ర హక్కులను అమలు చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలతోనే జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆప్ ఎంపి సంజయ్ అరోరా కోరారు. పంజాబీ ప్రజలను, ముఖ్యంగా హిందూ పండిట్ల మాదిరిగానే కష్టాలను ఎదుర్కొన్న సిక్కులను సమానంగా పరిగణించాలని కోరారు. బిజెపి ఎంపి సుధాన్షు త్రివేది మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో డీలిమిటేషన్, నివాసం, అభివృద్ధి అనే మూడు సమస్యలు ఉన్నాయని అన్నారు.

గ్యాస్ సబ్సిడీ రూ.30,244 కోట్లు కోత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు గ్యాస్ సబ్సిడీకి భారీగా కోత విధించింది. ఐదేళ్లలో రూ.30,244 కోట్ల గ్యాస్ సబ్సిడీని కోత కోసింది. దీంతో దేశంలోని సామాన్య ప్రజలకు భారం తీవ్రంగా పెరిగింది. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19లో రూ.37,209 కోట్లు ఉన్న గ్యాస్ సబ్సిడీ, 2022-23 నాటికి రూ.6,965 కోట్లకు తగ్గింది. ఐదేళ్లలో రూ.30,244 కోట్ల గ్యాస్ సబ్సిడీని మోడీ ప్రభుత్వం తగ్గించింది.

సంవత్సరం	సబ్సిడీ (రూ.కోట్లలో)
2018-19	రూ.37,209
2019-20	రూ.24,172
2020-21	రూ.11,896
2021-22	రూ.1,811
2022-23	రూ.6,965

పెట్రోలియం పిఎస్‌యుల్లో ఖాళీలు

పెట్రోలియం మంత్రిత్వశాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్‌యు)ల్లో 2,920 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ అన్నారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి ఎఎ రహీం అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 డిసెంబరు 5 నాటికి పెట్రోలియం పిఎస్‌యుల్లో 2,920 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

గాజాలో కొనసాగుతున్న భీకర పోరు

- ఇప్పటివరకు 18వేల మందికి పైగా మృతి
- రమల్లాలో పాలస్తీనియన్ల ప్రదర్శన
- యుద్ధం ముగింపు కనుచూపు మేరలో లేదన్న నెతన్యాహు
- రఫా క్రాసింగ్ వద్దకు పలు దేశాల రాయబారుల బృందం

సెంట్రల్ కోపెన్‌హాగన్‌లోని డెన్మార్క్ పార్లమెంట్ ముందు పాలస్తీనియులకు అనుకూల ర్యాలీలో సెల్‌ఫోన్ లైట్లు ఆన్‌చేసిన దృశ్యం

గాజా : గాజా సెంట్రల్, ఉత్తర ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దారుణంగా వైమానిక దాడులు జరుపుతోంది. మరోవైపు దక్షిణ ప్రాంతంలో పదాతి దళాల పోరాటం భీకరంగా సాగుతోంది. ఇప్పటివరకు 18వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వేల సంఖ్యలోనే గాయపడ్డారు. శాంతి కోసం ఒక్క తాటిపైకి రావాలని కోరుతూ ఈజిప్ట్, మారిటానియాలు తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంగళవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇజ్రాయిల్, హిజ్బుల్లాలు వైమానిక దాడులను ముమ్మరం చేసి, డ్రోన్ దాడులు జరుపుతున్నందున, ఈ ఘర్షణలు, యుద్ధం మరింత విస్తరించబడతాయని లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి బలగాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గాజాలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ ఎమర్జెన్సీ కోఆర్డినేటర్ మేరీ ఆర్ పియర్రట్ తెలిపారు. అల్ అక్సా ఆస్పత్రి లోపల నుండి ఆమె మీడియాతో మాట్లాడారు. గాజాలో తమ సంస్థ సేవలు చాలా పరిమితంగా అందుతున్నాయన్నారు. గాయపడి చికిత్స కోసం వచ్చే వారిని ఆదుకోవడం చాలా కష్టంగా మారిందని చెప్పారు. వైద్య సిబ్బందికి కూడా రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. అనేకమంది అసలు ఆస్పత్రులకు వచ్చే పరిస్థితి కూడా లేకపోయిందన్నారు.

గాజాకు మద్దతుగా రమల్లా నగరంలో పాలస్తీనా అనుకూల ప్రదర్శన జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు ఇందులో పాల్గొన్నారు. గాజాలో చనిపోయిన వారికి అంకితం చేస్తూ ఒక పోస్టర్‌ను వేలాడదీశారు. అన్ని వయసుల వారు ఇందులో పాల్గొన్నారు. పిల్లలు పాలస్తీనా పతాకాలు గీస్తూ తమ వంతుగా సంఘీభావం అందించారు. పాలస్తీనా జీవించేలా అవసరమైతే మేం మరణిస్తామంటూ వారు నినదించారు. తుపాకులతో కాల్పులు జరిపినా భయపడేది లేదని వారు పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ఇంకా చాలా దూరంలో వుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. తామనుకున్న లక్ష్యాలు నెరవేరేవరకు ఈ పోరు ఆగదని ఆయన స్పష్టం చేశారు. సుదీర్ఘ మైన యుద్ధం కొనసాగించే శక్తి సామర్ధ్యాలు ఇజ్రాయిల్ మిలటరీకి వున్నాయన్నారు. యుద్ధానంతర గాజాపై చర్చించేందుకు రహస్య బృందాన్ని నెతన్యాహు ఏర్పాటు చేశారు. రక్షణ రంగానికి చెందిన వారితో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ భద్రతా సలహాదారు, వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి నేతృత్వంలో ఈ బృందం ఇప్పటికి నాలుగుసార్లు సమావేశమైంది. ఈ వారంలో మరోసారి భేటీ కానుందని ఇజ్రాయిల్ చానల్ పేర్కొంది. ఈ బృందంలో ఆర్మీ, మొస్సాద్, షిన్‌బెట్ ప్రతినిధులు కూడా వున్నారు. గాజాలో సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో రఫా క్రాసింగ్ వద్ద పరిశీలించడానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి దూతలు ఈజిప్ట్ చేరుకున్నారు. ఈజిప్ట్, యుఎఇలు ఈ పర్యటనను ఏర్పాటు చేశాయి. రష్యా, బ్రిటన్ దేశాలతో కలిపి మొత్తంగా 12మంది రాయబారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. పాలస్తీనియన్ల బాధ, కష్టాలను నిర్లక్ష్యం చేయడం ఎంత మాత్రమూ సమర్ధనీయం కాదని ఈజిప్ట్ విదేశాంగ శాఖ పేర్కొంది. గాజా ప్రజల ఇబ్బందులను, అక్కడ జరిగిన వినాశనాన్ని చూడడమే కాకుండా వారి బలాన్ని, ఆశను కూడా అర్థం చేసుకోవడానికి ఈ పర్యటన ఉపకరిస్తుందని ఐక్యరాజ్య సమితిలో యుఎఇ రాయబారి వ్యాఖ్యానించారు.

శిలాజ ఇంధనాల ప్రస్తావన లేకుండానే కాప్ 28 ముసాయిదా

దుబాయ్ : శిలాజ ఇంధనాలను దశల వారీగా నిర్మూలించే ప్రస్తావనే లేకుండా కాప్ 28 ముసాయిదాను సోమవారం ప్రచురించారు. దుబాయ్ ఆతిథ్యంలో జరుగుతున్న కాప్ 28 సదస్సు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐరాస వాతావరణ విభాగం ముసాయిదాను ప్రచురించింది. ఇందులో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడానికి దేశాలు తీసుకోవల్సిన చర్యల గురించి మాత్రమే ప్రస్తావించారు. శిలాజ ఇంధనాలను దశల వారీగా నిర్మూలించే ప్రస్తావనే లేకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఈ ముసాయిదాలో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను వేగంగా, స్థిరంగా తగ్గించాల్సిన ఆవశ్యకత గురించి, తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి పేర్కొన్నారు.

ప్రచురించిన ముసాయిదా వివరాలు..

(ఎ) ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన సామర్ధ్యాన్ని మూడు రెట్లు పెంచడం. 2030 నాటికి ప్రపంచ సగటు వార్షిక పునరుత్పాదక ఇంధన సామర్ధ్యం మెరుగుదల రేటును రెట్టింపు చేయడం.

(బి) వేగంగా బొగ్గు వినియోగాన్ని తగ్గించడం. నూతన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అనుమతిపై పరిమితులు విధించడం.

(సి) బొగ్గు ఆధారిత ఇంధన వినియోగాన్ని తగ్గించడం. ఇలాంటి ప్రయత్నాలను ప్రపంచవ్యాప్తంగా వేగవంతం చేయడం.

(డి) శిలాజ ఇంధన ప్రత్యామ్నాయం వైపు ప్రయత్నాలను వేగవంతం చేయడం.

(ఇ) 2050 నాటికి లేదా అంతకంటే ముందుగా శిలాజ ఇంధనాల వినియోగం. ఉత్పత్తి రెండింటినీ న్యాయంగా, క్రమబద్ధంగా, సమానమైన పద్ధతిలో తగ్గించడం.

(ఎఫ్) 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా కర్బనేతర ఉద్గారాలను.. ప్రధానంగా మీథేన్ ఉద్గారాలు వేగవంతంగా, గణనీయంగా తగ్గించడం.

(జి) నడకదారులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి, తక్కువగా ఉద్గారాలను విడుదల చేసే వాహనాల అభివృద్ధి వంటి మార్గాలు ద్వారా ఉద్గారాలను వేగంగా తగ్గించడం.

(హెచ్) శిలాజ ఇంధన సబ్సిడీలను వీలైనంత త్వరగా తొలగించడం.



శ్రీనగర్‌లో మోహరించిన పోలీసులు

గృహ నిర్బంధంలో జమ్ముకాశ్మీర్ నేతలు

- పోరాటం కొనసాగుతుందని నేతల స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడానికి ముందే జమ్ము కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. తీర్పుకు వ్యతిరేకంగా కాశ్మీర్ లోయలో ఎలాంటి నిరసనలను అనుమతించరాదన్న దాంతో జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, సిపిఐ(ఎం) నాయకులు యూసఫ్ తరిగామితో సహా పలువురు నేతలను, రాజకీయ కార్యకర్తలను గృహనిర్బంధం గావించింది. మీడియా వారితో కూడా మాట్లాడనివ్వలేదు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, తాము ఎవరినీ గృహనిర్బంధంలో ఉంచలేదని జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నరు మనోజ్ సిన్హా ఒక ప్రకటన చేశారు. సోమవారం ఉదయం నుండి తనను గృహ నిర్బంధంలో వుంచారని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. తన ఇంటి గేటుకు తాళం వేశారని, మీడియా వారిని తనతో మాట్లాడనివ్వలేదని చెప్పారు. న్యాయం జరుగుతుందనే ఆశతో సుప్రీం తలుపుతు తట్టాం, కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తామన్నారు. 'మేం విఫలమయి వుండవచ్చు, నిర్ణయం నిరాశను కలిగించవచ్చు, కానీ ఇదంతా తాత్కాలికమైన ఎదురు దెబ్బే, మాది రాజకీయ పోరాటం, చట్టపరిధుల్లోనే మా పోరాటం కొనసాగుతుంది." అని చెప్పారు. తనను ఇంటి నుండి బయటకు వెళ్లడానికి అనుమతించలేదని సిపిఎం నేత ఎం.వై.తరిగామి అన్నారు. మీడియా వారిని కూడా రానివ్వలేదన్నారు. సుప్రీం తీర్పుపై పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు (పిడిపి) మెహబూబా ముఫ్తి స్పందిస్తూ, దీనివల్ల మనకు కలిగే కీడు కన్నా భారతదేశ ఆలోచనకు కలిగించే నష్టమే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. 2019 ఆగస్టు 5న భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయానికి సుప్రీం ఆమోద ముద్ర వేయడమంటే భారతదేశపు ఆలోచనను సమాధి చేయడమేనని ఆమె పేర్కొన్నారు. ఆ ద్రోహమనేది వారి నుండే వచ్చింది, మన నుండి కాదని అన్నారు. 370వ అధికరణను తాత్కాలిక నిబంధన అని పేర్కొనడం ద్వారా దేశాన్ని బలహీనపరిచారు. భారత్‌లో జమ్ముకాశ్మీర్ విలీనం తాత్కాలికమని చెప్పిన శక్తులు బలోపేతమయ్యాయని ఆమె విమర్శించారు. హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనను గృహ నిర్బంధంలో వుంచారని పేర్కొన్నారు. జమ్ముకాశ్మీర్ ప్రజలకు సంఘీభావంగా వారం రోజుల పాటు అన్ని రాజకీయ కార్యకలాపాలను రద్దు చేస్తున్నట్లు పిడిపి ప్రకటించింది.

సంతోషంగా లేరు

ఈ తీర్పుతో జమ్మూ కాశ్మీర్ ప్రజలు సంతోషంగా లేరని మాజీ కాంగ్రెస్ నేత గులాం నబీ అజాద్ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టే మా చివరి ఆశ, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35-ఎలు జమ్మూకాశ్మీర్‌కు సంబంధించిన చారిత్రక అంశాలు. కోర్టు నిర్ణయం మమ్మల్ని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందని చెప్పారు. ఈ తీర్పు పట్ల పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజాద్ లోనె తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సుప్రీం రూలింగ్‌ని ఆమోదించి, ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా జమ్ము కాశ్మీర్ చివరి డోగ్రా పాలకుడు మహారాజా హరిసింగ్ మనవడు కరణ్ సింగ్ ప్రజలను కోరారు.

ఢిల్లీలో దిగజారుతున్న గాలి నాణ్యత

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయి. సోమవారం ఉదయానికి కూడా గాలి నాణ్యతల్లో ఎలాంటి మెరుగుదల లేదని, అక్కడ పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం ఉదయం 8 గంటల సమయానిక ఢిల్లీలోని ఆర్.కె. పురం ప్రాంతంలో 346, ఆనంద్ విహార్‌లో 310 గాలి నాణ్యతలు (ఎక్యూఐ) నమోదయ్యాయని, తీవ్ర స్థాయిలోనే వాయు కాలుష్యం ఉందని సిపిసిబి వెల్లడించింది.

వైసిపిలో పెనుమార్పులు

(మొదటిపేజీ తరువాయి)

వేమూరుకు పంపించారు. చిలకలూరిపేటకు మల్లెల రాజేష్‌నాయుడు, అద్దంకి పాణెం హనిమిరెడ్డి, మంగళగిరికి గంజి చిరంజీవిని, రేపల్లెకు డాక్టర్ ఈపూరు గణేష్‌ను నియమించారు. గాజువాకకు వరికూటి రామచంద్రరావును నియమించారు. దాంతో అక్కడి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి తనయుడు దేవన్‌రెడ్డి రాజీనామా చేశారు. మంగళగిరి నియోజకవర్గానికి బిసి అభ్యర్థిని నియమించాలనే ఉద్దేశంతోనే గంజి చిరంజీవిని పార్టీ అధిష్టానం ప్రకటించింది. అలాగే చిలకలూరిపేటలో విడదల రజిని మీద వ్యతిరేకత ఉండటంతో ఆమెను అక్కడ నుండి తొలగించి గుంటూరు పశ్చిమకు పంపించారని సమాచారం. కొండెపి ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గంలో గ్రూపులు ఏర్పడడంతో అక్కడ ఆదిమూలపు సురేష్‌ను నియమించారు. అక్కడ నుండి వరికూటి అశోక్‌బాబును తీసుకొచ్చి వేమూరులో నియమించారు. వేమూరులో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న నాగార్జునను సంతనూతలపాడులో నియమించారు. అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న టిజెఆర్ సుధాకర్‌బాబుకు సీటు కేటాయింపు అనుమానమేనంటున్నారు. అలాగే గుంటూరు పశ్చిమ నుండి తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన మద్దాలి గిరిధరరావుకు సీటు కేటాయింపు లేదు. ఎమ్మెల్సీ ఇవ్వొచ్చని ప్రచారం. 2019 ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయిన డొక్కా మాణిక్య వరప్రసాదరావును తాడికొండ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇప్పుడు అతన్ని తొలగించి ఊహించని విధంగా మేకతోటి సుచరితను నియమించారు. ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది ఎమ్మెల్యేలకు స్థానచలనం ఉందని తెలిసింది. ఒకటీ రెండు రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. అలాగే కృష్ణా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇన్ ఛార్జులతో సిఎం సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. అయితే ఆర్‌కె రాజీనామాపై స్పీకర్ తమ్మినేని సీతారాం స్పందించారు. ఆయన రాజీనామా పత్రం ఫార్మాట్ చూసిన తరువాత నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు.

కూర్చోబెట్టి మాట్లాడతాం : బొత్స, సజ్జల రామకృష్ణారెడ్డి

అసంతృప్తులు సహజమేనని రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మార్పులు, చేర్పులపై కూర్చోబెట్టి మాట్లాడతామని తెలిపారు. సిఎం సాంకేతికంగా అన్ని కోణాల్లో ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

కలవరపరుస్తున్న సుప్రీం తీర్పు !

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు ఆదేశించడం. అంటే జమ్మూ కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం తన నియంత్రణను కొసాగించేందుకు సుదీర్ఘ సమయాన్ని ఇవ్వడమేనని పొలిట్‌బ్యూరో విమర్శించింది. పార్లమెంటులో జమ్ము కాశ్మీర్ కు సంబంధజంచిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్న 2019 ఆగస్టు5 కుముందు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించబడింది.ఎన్నికైన శాసనసభ లేదు. ఆ సమయంలో రాష్ట్రపతి నియమించిన గవర్నర్ యొక్క సమ్మతిని రాష్ట్ర సమ్మతిగా పరిగణించారు. ఎన్నికైన సభలేనప్పుడు గవర్నరు ఆమోదాన్ని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చా? అని ప్రశ్నించింది. దీనివల్ల, రాష్ట్రపతి పాలన విధించబడే, దాని సరిహద్దులు మార్చబడే లేదా రాష్ట్ర హోదాను రద్దు చేయబడే ఇతర రాష్ట్రాలపైనా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. రాజ్యాంగంలో ఆర్టికల్3 ప్రకారం ఏ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లునైనా అభిప్రాయం తెలుసుకునే నిమిత్తం సంబంధిత రాష్ట్ర అసెంబ్లీకి రాష్ట్రపతి నివేదించాల్సి వుంటుంది. కానీ, కొత్త రాష్ట్రాల ఏర్పాటు, ప్రాంతాలు, సరిహద్దులు లేదా ప్రస్తుతమున్న రాష్ట్రాల పేర్లు మార్పుకు సంబంధించి కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా చర్యలు తీసుకోవడానికి అనుమతించే ఈ తీర్పు అనేక సమస్యలకు దారి తీస్తుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇది సమాఖ్యవాదానికి, ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీల హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది కూడా. సుప్రీం కోర్టు ఇచ్చిన ప్రధాన తీర్పును, దానితో పాటే ఇచ్చిన మరో రెండు తీర్పులను కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాత దీనిపై తమ వివరణాత్మకమైన ప్రతిస్పందన తెలియజేస్తామని పేర్కొంది. ఏది ఏమైనా, ఈ తీర్పు వల్ల మన రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందనేది స్పష్టం. జాతీయ భద్రత, సమైక్యత పేరుతో ఏకపక్ష రాజ్య వ్యవస్థను బలోపేతం చేసేలా తీర్పు వుందని వ్యాఖ్యానించింది.

చిన్నారి

మీకోసం

చలికాలం చర్మం పొడిబారకుండా, పగుళ్లు రాకుండా ఉండాలంటే ఉదయం గోరువెచ్చని నీటిలో కొద్దిగా కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనె చుక్కలు వేసి స్నానం చేయాలి.

జీవన సౌరభం

ఏ సమస్యనైనా ఎదుర్కొనే మానసిక సామర్థ్యం అలవర్చుకుంటే సమస్యలన్నీ చిన్నవిగా కనిపిస్తాయి.

JEEVANA జీవన the family

తపాలా పథకాలపై ప్రాజెక్టు



హాయ్ ఫ్రెండ్స్,

మా స్కూల్లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మా ఊరి హెడ్ పోస్ట్ మాస్టర్ ఎం.నరసింహారెడ్డి మాట్లాడారు. ఆయన మాకు కొన్ని కరపత్రాలను ఇచ్చారు. వాటిని చదివి దానిపై ప్రాజెక్టుని చేశాం.

తపాల శాఖ మనకు ఎన్నో విధాలుగా సహాయపడుతుందని ఈ ప్రాజెక్టు ద్వారా నేను తెలుసుకున్నాను. దీనికిముందు తపాలా శాఖ ఉత్తరాలు పంపడానికి మాత్రమే ఉపయోగపడుతుందని అనుకునేదానిని. ఎన్నో పథకాల ద్వారా ప్రజా సేవ చేస్తోందని ఇప్పుడు అర్థమైంది.

ఆధార్ మినీ ఎటిఎం తపాలా శాఖ నిర్వమిస్తోంది. దీనివల్ల ఎంతో ఉపయోగం ఉంది. సంవత్సరానికి కొంత డబ్బు కడితే, కొన్నాళ్ళకి ఆ డబ్బులు తీసుకొని వాడుకోవచ్చు. సుకన్య సమృద్ధి యోజన వల్ల ఆడపిల్లలు ఎంతో లబ్ధి పొందుతున్నారు. రాఖీ పథకం పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. ఇలా భారత ప్రభుత్వం పోస్టాఫీసు ద్వారా ప్రవేశపెట్టిన పథకాలను అందరూ సద్వినియోగపరుచుకోవాలి.

- ఆర్. జశ్విత,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.

సరిచేసి రాయండి

పిల్లలూ,
ఇక్కడ ఇచ్చిన బాక్సుల్లో ఆంగ్ల అక్షరాలను కింద ఇచ్చిన గడుల్లో వరుస క్రమంలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. క్లూ ఆధారంగా సరిచేసి రాయండి.

O	S	C	P	O

R	O	M	B	O

O	N	S	P	O

R	O	O	F	L

నేను గీసిన బొమ్మ

ఎం. హన్‌ష్వి,
2వ తరగతి,
వివేకానంద ఎన్‌జి ఇంగ్లీషు మీడియం స్కూలు

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ డాక్టరు వ్యవసాయమూ చేస్తారు!

వృత్తిరీత్యా ఆయన డాక్టరు. కానీ రైతుగా ఉండడమే ఆయనకిష్టం. కాస్త తీరిక దొరికితే ఆయనలో క్రీడాకారుడూ కనబడతాడు. ఇంకాస్త విరామం వస్తే, విభిన్న ప్రతిభావంతులు, పేదపిల్లలను చదివిస్తున్న సేవాతత్పరుడుగా దర్శనమిస్తాడు. వృత్తికి, అభిరుచులకు ఎక్కడా పొంతనే కనిపించని ఆ వైద్యుడు కర్నాటక గడగ్ ప్రాంతంలో 'రేణుకా' హాస్పటల్ నిర్వాహకుడిగా ఎందరికో సుపరిచితులు. సాధారణంగా వైద్యవృత్తిలో ఉన్నవారు ఇతర రంగాల వైపు దృష్టిమరల్చడం చాలా అరుదు. కానీ డాక్టర్ జిబి బిదిన్‌హాల్ మాత్రం వారికి భిన్నంగా జీవిస్తున్నారు. 68 ఏళ్ల వయసులో కూడా మెరుగైన సమాజ కోసం పరితపిస్తున్నారు.

హుబ్లీ, కిమ్స్‌లో ఎంబిబిఎస్, ఎంఎస్ చదివిన బిదిన్‌హాల్, వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. స్వతహాగానే బిదిన్‌హాల్‌కి మట్టిపై ఎంతో ప్రేమ. అందుకే డాక్టరుగా బాధ్యతగా ఉంటూనే నేలతల్లికి తన వంతు సేవ చేస్తూ ఉంటారు. రోజుకు 25 నుండి 30 రోగులకు చికిత్స అందించే బిదిన్‌హాల్ పేదల దగ్గర నయాపైసా తీసుకోరు.

'డాక్టరు గారు వైద్యం చేస్తున్నంత సేపు ఆయన ముఖంలో చిరునవ్వు తగ్గదు. నవ్వుతూనే మా రోగాన్ని పోగొడతారు. ఆ నవ్వు మాలో ఎక్కడలేని ధైర్యాన్ని నింపుతుంది' అని ఆస్పత్రికి వచ్చిన రోగులు బిదిన్‌హాల్ గురించి గొప్పగా చెబుతారు. 'మాకు వైద్యం చేసేటప్పుడు మమ్మల్ని ఆయన సొంత అన్నదమ్ముల్లాగా భావిస్తారు. ఆ ఆప్యాయత మమ్మల్ని రోగం నుంచి త్వరగా విముక్తులను చేస్తుంది' అంటాడు అక్కడే ఉన్న మరో రోగి. ఇవన్నీ ఆయనలోని ప్రజా వైద్యుడ్ని మనకు పరిచయం చేస్తాయి. అలాగే, ఆయన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కావాల్సిన సామగ్రిని, విద్యకు అవసరమైన ఖర్చును భరిస్తారు. రోజూ ఉదయం పూట గడగ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఓ గంట పాటు పరుగు ప్రాక్టీస్ చేస్తారు. పలు వాక్‌థాన్, మారాథాన్ పోటీల్లో పాల్గొంటారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్స్ నిర్వహించిన 100 మీటర్ల రిలే వాక్‌థాన్, 10 కిలోమీటర్ల మారాథాన్‌లో పాల్గొని, మొదటిస్థానంలో నిలిచారు. పొరుగు రాష్ట్రంలో తమ రాష్ట్ర గౌరవాన్ని పెంచిన, యువతలో గొప్ప క్రీడాస్ఫూర్తి కలిగించిన బిదిన్‌హాల్‌కి 'గడగ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్', నవంబరు 30న 'క్రీడా శ్రీ' అవార్డుతో సత్కరించింది.

వ్యవసాయ మూలాలున్న బిదిన్‌హాల్, ఎంఎస్ చేసినా వ్యవసాయం వదల్లేదు. పంటలు, మార్కెట్ ధరలపై ఎప్పుడూ విస్తృత అవగాహనతో ఉంటారు. ఎపిఎంసి (అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ)లో పంటల ధరల గురించి తెలుసుకొని, ఉత్తమ ధరలు అందించే విక్రయ స్థలాల సమాచారాన్ని రైతులకు

అందిస్తారు. గతేడాది మిర్చి సాగు చేసి తీవ్ర నష్టాలు చూసిన రైతన్నలకు మంచి మార్కెట్ ధర పలికే విక్రయ స్థల సమాచారం చెప్పి, కాస్తంత ఊరట ఇచ్చారు.

'బిదిన్‌హాల్ నాకు మూడు దశాబ్దాలుగా తెలుసు. ఆయన చాలా కష్టపడే వ్యక్తి. వైద్య వృత్తి కొనసాగిస్తూనే, క్రీడాకారుడిగా రాణిస్తున్నారు. వ్యవసాయం చేస్తున్నారు. గడగ్ ప్రాంతం ఒక్కచోటే కాదు.. ఆయన దగ్గర వైద్యం చేయించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా ప్రజలు వస్తారు' అని శ్రీనివాస్ అనే గడగ్ ప్రాంత వాసి చెబుతున్నారు.

'68 ఏళ్ల వయసులో ఆయనలో గొప్ప వైద్యుడిని చూస్తాం. అదే సమయంలో ఆయనలో పొలంలో పనిచేసే రైతును కూడా కలుస్తాం. వ్యవసాయ పనులు చేసేటప్పుడు యువరైతులకు ఏమాత్రం తీసిపోని పనులు చేస్తారు. అథ్లెట్‌గా నాలుగు బంగారు పతకాలు సాధించారు.' అని విశ్రాంత ప్రొఫెసర్ శరణబసవ తన ఈడు వాడైన బిదిన్‌హాల్ గురించి గొప్పగా అంటున్నారు.

రైతు కుటుంబంలో పెరిగిన నాకు మనసంతా వ్యవసాయమే నిండిపోయింది. పొలంలో పనిచేస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉంటుంది. నా పొలంలో మిరప, మిరియాలు, ఉల్లిపాయలు, పత్తి పండిస్తాను. నా తల్లిదండ్రుల వృత్తిని వదిలిపెట్టకుండా, వైద్యుడిగా నా వృత్తిధర్మం నెరవేరుస్తున్నాను. ఈ ప్రయాణంలో నాకు అండగా ఉన్న వారందరికీ నేను ఎప్పుడూ కృతజ్ఞుడిని' అంటూ నిగర్విగా మాట్లాడుతున్న బిదిన్‌హాల్ వంటి వ్యక్తులు చాలా అరుదుగా కనబడతారు.

బూడిద గుమ్మడి .. బోలెడు ప్రయోజనాలు..

బూడిద గుమ్మడికాయను తినడానికి చాలామంది ఇష్టపడరు. కాని బూడిద గుమ్మడికాయలో పోషకాలు ఎక్కువ. కేలరీలు తక్కువ. దీనిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. దోసకాయ రుచి లాగే ఉండే ఈ గుమ్మడికాయ ఉపయోగాలు బోలెడు.

- నీటి శాతం ఎక్కువగా ఉండే బూడిద గుమ్మడికాయలను స్మూతీలు, జ్యూస్‌లు, సలాడ్‌ల రూపంలో ఆహారంలో చేర్చుకోవచ్చు.
- ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. జింక్, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్ఫరస్, కాపర్, మాంగనీస్ వంటి ఖనిజాలు ఉంటాయి. విటమిన్ సి, నియాసిన్, రిబోఫ్లేవిన్, థయామిన్ వంటి విటమిన్లు కూడా ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇంకా ఆల్కలాయిడ్లు, టానిన్లు, గ్లైకోసైడ్లు, ఫినాల్స్, ఫ్లేవనాయిడ్లు వంటి ఫైటోకెమికల్స్ కూడా అధికంగా ఉంటాయి.
- ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో చెడు కొవ్వు చేరనీయకుండా కాపాడుతుంది.
- తరచూ తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. దీనిలో ఉండే ఫోలేట్ పుట్టుకతో వచ్చే లోపాలను నివారించడానికి కూడా సహాయపడుతుంది.
- ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలు రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో సహాయపడతాయి.
- మధుమేహ బాధితుల శరీరంలోని చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది.
- క్షయ, రక్తహీనతను తగ్గించడానికి సహాయపడుతుంది.
- పేగుల కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆంత్రము, చిన్నప్రేవులు లేక పెద్ద ప్రేవుల్లోని అసౌకర్యాన్ని తగ్గిస్తాయి.
- పీచు, పొటాషియం ఉండటం వల్ల అధిక రక్తపోటును నిరోధిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడటాన్ని కూడా నిరోధిస్తుంది. కంటి చూపు మెరుగవడానికి తోడ్పడుతుంది.
- ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్స్, విటమిన్ సి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది.
- అయితే జలుబు, ఆస్తమా, సైనసైటిస్ సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకోకపోవడమే మంచిది. ఎందుకంటే దీనిలో శరీరాన్ని చల్లబరిచే గుణాలుంటాయి.

సైంధవ్ అలరిస్తుంది

వెంకటేష్

సంక్రాంతికి విడుదల కానున్న 'సైంధవ్' సినిమా ప్రేక్షకులను అలరిస్తుందని హీరో వెంకటేష్ దగ్గుపాటి చెప్పారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ చిత్ర యూనిట్ విజయవాడలో సోమవారం మీడియాతో సమావేశం ఏర్పాటు చేసింది. వెంకటేష్ మాట్లాడుతూ 'కలియుగ పాండవులు నుంచి నేటి సైంధవ్ వరకూ 75 సినిమాలను ఆదరించిన ప్రేక్షకులకు హృదయపూర్వక నమస్కారాలు. సైంధవ్‌లో అన్ని కోణాలు ఉంటాయి. మాస్, యాక్షన్, సెంటిమెంట్ ఇలా అన్ని అంశాలు మిళితం అయ్యాయి. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలకు భిన్నంగా ఉంటుంది. శైలేష్ కొలను మంచి కథను ఎంపిక చేశారు. ప్రేమ, కుటుంబ కథా, యాక్షన్, ప్యాక్షన్ వంటి అనేక సినిమాలు చేశాను. నేను చేసిన ఫన్ మూవీస్‌ను ఆదరించారు. ఎఫ్2, ఎఫ్3లతోపాటుగా నారప్ప, దృశ్యం వంటి సినిమాలకు నాకు మంచి పేరు వచ్చింది. రాబోయే రోజుల్లో అందరు హీరోలతో కలిసి మల్టీస్టారర్ చేయాలని అనుకుంటున్నా. సంక్రాంతికి విడుదలైన నా సినిమాలన్నీ విజయవంతమయ్యాయి. సైంధవ్‌ను కూడా ఆదరించండి' అని కోరారు.

హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'వెంకటేష్‌తో చేయటం చాలా చక్కటి అనుభూతి. వెరీ ట్యాలెంటెడ్ శైలేష్ కొలను. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ 'రాంగ్ యూసేజ్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది' అని వివరించారు. దర్శక, నిర్మాతలైన శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ వికాస్ మాలిక్ అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం, ఎస్.మణికందన్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, గ్యారీ బిహెచ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆర్య, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, బేబీ సారా, జయప్రకాష్ ఈ సినిమాలో ఇతర ముఖ్య తారాగణంగా ఉన్నారు. కిషోర్ తాళ్లూరు సహ నిర్మాత వ్యవహరిస్తున్నారు' అని వివరించారు.

4 వేదికలు, 41 మ్యాచ్‌లు

ఐసిసి అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి భారత్

దుబాయ్ : ఐసిసి మెన్స్ అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్ వచ్చేసింది. శ్రీలంక ఆతిథ్యం ఇవ్వాల్సిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీ అనూహ్య పరిణామాల నడుమ దక్షిణాఫ్రికా తరలిన సంగతి తెలిసిందే. శ్రీలంక క్రికెట్ బోర్డుపై ఐసిసి సస్పెన్షన్ వేటు వేయటంతో.. ఆ దేశం ఆతిథ్య హక్కులు కోల్పోయింది. దక్షిణాఫ్రికాలో నాలుగు నగరాల్లో 41 మ్యాచులతో కూడిన ప్రపంచకప్ జరుగనుంది. 2024 జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. ఈ మేరకు ఐసీసీ సోమవారం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేసింది.

ఫార్మాట్ మారింది : అండర్-19 ప్రపంచకప్ ఫార్మాట్‌ను ఐసిసి మార్పు చేసింది. గతంలో గ్రూప్ దశ తర్వాత నాకౌట్ షురూ అయ్యేది. ఇప్పుడు గ్రూప్ దశ తర్వాత సూపర్ 6 దశను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత నాకౌట్ మ్యాచులు ఉంటాయి. తొలుత ప్రకటించినట్టే నాలుగు గ్రూపుల్లో నాలుగేసి జట్లు పోటీపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత్ సహా బంగ్లాదేశ్, ఐర్లాండ్, అమెరికాలు గ్రూప్-ఏలో ఉన్నాయి. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, స్కాట్లాండ్‌లు గ్రూప్-బిలో.. ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, నమీబియాలు గ్రూప్-సిలో.. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్, న్యూజిలాండ్, నేపాల్‌లు గ్రూప్-డిలో ఉన్నాయి. గ్రూప్ దశ మ్యాచుల అనంతరం ఆరు జట్లు సూపర్6 దశకు చేరుకుంటాయి. సూపర్ సిక్స్‌లో ఆరు జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఫిబ్రవరి 11న టైటిల్ పోరు జరుగనుండగా, ఆ తర్వాతి రోజును రిజర్వ్ డేగా ఉంచారు. భారత్ తన తొలి మ్యాచ్‌ను జనవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ప్రధాన టోర్నీకి ముందు ప్రతి జట్టు రెండు వార్మప్ మ్యాచులు ఆడనుంది. వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచులు జనవరి 13-17న షెడ్యూల్ చేశారు.

విజయ్‌కాంత్ కోలుకున్నారు

కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురైన తమిళ నటుడు విజయకాంత్ ఆస్పత్రి నుండి సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. దగ్గు, జలుబు కారణంతో ఆస్పత్రిలో చేరిన విజయ్‌కాంత్‌కి చికిత్స అందిస్తున్న క్రమంలో శ్వాసకోస సంబంధిత సమస్యలను ఎదురయ్యాయి. 20 రోజులకు పైగానే చికిత్స పొందారు. ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకున్నారని ఆస్పత్రి వర్గాలు హెల్త్ బులిటెన్ విడుదల చేశాయి. మయత్ హాస్పిటల్ నుంచి పూర్తి ఆరోగ్యంతో ఆయన ఇంటికి చేరుకున్నారు.


MIOT International

11/12/2023

MEDICAL BULLETIN

Mr. Vijayakanth was discharged home today after a full recovery following treatment at MIOT Hospitals Chennai.

With warm regards,

Dr. Prithvi Mohandas

అడవి శేషు జి2 ప్రారంభం

హీరో అడవి శేషు నటిస్తున్న తాజా చిత్రం జి2 షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఐదు అంతస్తుల లావిష్ గ్లాస్ సెట్‌ను నిర్మించారు. క్రిస్ప్ సూట్ ధరించిన అడివి శేష్ అందరినీ ఆకట్టుకున్నారు. తన దేశం కోసం పోరాడటానికి ఇండియా వెలుపల మిషన్‌లో ఉన్న గూఢచారి కథ ఇది అని చిత్ర యూనిట్ ప్రతినిధులు తెలిపారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు.

15న 'ఆలంబన' విడుదల

సీనియర్ దర్శకుడు కోదండ రామిరెడ్డి తనయుడు వైభవ్ నటించిన 'ఆలంబన' సినిమా ట్రైలర్ సోమవారం విడుదల చేశారు. పార్వతి నాయర్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి పారి కె.విజయ్ దర్శకత్వం వహించారు. మురళి శర్మ ఒక ప్రధాన పాత్ర పోషించారు. డిసెంబర్ 15న తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నారు. 'ఈ సినిమాను థియేటర్లో చూస్తేనే ఆ విజువల్ బ్యూటీ, గ్రాండియర్ తెలుస్తుంది. సినిమాలో కామెడీని కూడా థియేటర్లలో బాగా ఎంజాయ్ చేస్తారు' అని వైభవ్ అన్నారు. ఇంకా 'ఈ సినిమాలో జీనీ క్యారెక్టర్ బాగా అలరిస్తుంద'ని చెప్పారు. గంగ ఎంటర్టైన్మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి ఈ సినిమాని తెలుగులో విడుదల చేస్తున్నారు.

'బూట్ కట్ బాలరాజు' టీజర్ విడుదల

'బూట్ కట్ బాలరాజు' టీజర్‌ను సోమవారం డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సోహెల్ నాకు బిగ్‌బాస్ అప్పటి నుంచి బాగా తెలుసు. ఈ సినిమాతో తనకి మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. ఇంద్రజ ఇటు టీవీ, అటు సినిమా రెండిటిలో అలరిస్తున్నారు. దర్శకుడు కోనేటి చేస్తున్న రెండో సినిమా ఇది. సినిమా చాలా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను.' అని అన్నారు. 'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్న చిత్రం ఇది. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ట్రావిశ్ హెడ్ పట్టేశాడు

- ఐసిసి మంత్లీ అవార్డు సొంతం

దుబాయ్ : 2023 ప్రపంచకప్ ఫైనల్ హీరో, ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిశ్ హెడ్ ప్రతిష్టాత్మక ఐసిసి పురస్కారం దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సెమీస్‌లో, భారత్‌తో టైటిల్ పోరులో ట్రావిశ్ హెడ్ గెలుపు ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు. సఫారీపై 62, భారత్‌పై 137 పరుగులతో మెప్పించాడు. దీంతో ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ (నవంబర్)గా నిలిచాడు. బంగ్లాదేశ్ స్పిన్నర్ నహిద అక్తర్ మహిళల విభాగంలో నవంబర్ ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలిచింది.

చెస్ చాంప్స్ వీరేశ్, శ్రేయ

- జాతీయ అండర్-13 చెస్ టోర్నీ

హైదరాబాద్ : 36వ జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్స్ విజేతలుగా మహారాష్ట్రకు చెందిన వీరేశ్ (బాయ్స్), శ్రేయ్ (గర్ల్స్) నిలిచారు. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో 9.5 పాయింట్లు సాధించిన ఈ ఇద్దరు చాంపియన్‌షిప్ ట్రోఫీలతో పాటు చెరో రూ.80 వేల నగదు బహుమతి సైతం అందుకున్నారు. ఆదర్శ్ ఉప్పల (తెలంగాణ), రాఘవ్ (తమిళనాడు) బాలుర విభాగంలో సిల్వర్, కాంస్యం నెగ్గారు. బాలికల విభాగంలో శన్మతి శ్రీ (తమిళనాడు), కళ్యాణి (కేరళ) 2, 3 స్థానాల్లో నిలిచారు. సిల్వర్ మెడలిస్ట్‌కు రూ.60 వేలు, కాంస్య పతక విజేతకు రూ.48 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. ఎస్‌సీఆర్ఎస్ఏ చెస్ మాజీ కార్యదర్శి ఉమా శంకర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.బి.ఆర్ రాథోర్, తెలంగాణ చెస్ సంఘం అధ్యక్ష, కోశాధికారులు కె.ఎస్ ప్రసాద్, వంశీలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సంజయ్‌ని తప్పించండి!

- క్రీడాశాఖ మంత్రికి రెజ్లర్ల వినతి

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష రేసు నుంచి బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు సంజయ్ సింగ్‌ను తప్పించాలని అగ్రశేణి రెజ్లర్లు, ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు సోమవారం కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కోరారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా 12 ఏండ్లలో బ్రిజ్‌భూషణ్ ఎన్నో ఆగడాలకు పాల్పడ్డాడని, మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడని రెజ్లింగ్ క్రీడాకారులు జంతర్‌మంతర్ వద్ద రెండు దఫాలుగా ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. రెజ్లర్ల నిరసనను విరమింపజేసేందుకు.. బ్రిజ్‌భూషణ్ సింగ్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఎవరూ రానున్న ఎన్నికల్లో పోటీ చేయరనే హామీ క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇచ్చారు. కానీ డిసెంబర్ 21న ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో జరుగనున్న ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ అత్యంత సన్నిహితుడు సంజయ్ సింగ్ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. దీంతో రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిజ్‌భూషణ్ పదవిలో లేకపోయినా.. అతడి సన్నిహితుల ద్వారా మళ్లీ సమాఖ్యను నడిపిస్తాడని, మల్లయోధుల ఆందోళనకు అర్థమే లేకుండా పోతుందని ఈ సందర్భంగా క్రీడాశాఖ మంత్రితో బజరంగ్, సాక్షి తెలిపారు. సోమవారం క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్‌ను స్టార్ రెజ్లర్లు కలిశారు.

అతడు తప్పుకోకుంటే... : 'క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌ను కలిశాం. గతంలో ఇచ్చిన హామీ గుర్తు చేశాం. బ్రిజ్‌భూషణ్ అనుచరులు ఎవరూ ఎన్నికల్లో నిలబడకుండా చూస్తామని మాట ఇచ్చారు. సంజయ్ సింగ్... బ్రిజ్‌భూషణ్‌కు అత్యంత సన్నిహితుడు. అతడు అధ్యక్ష అభ్యర్థిగా తప్పుకోవాలి. లేదంటే, రెజ్లర్ల భవిష్యత్ కార్యాచరణపై పునరాలోచన చేస్తాం. అదే విషయాన్ని క్రీడాశాఖ మంత్రికి తెలిపాం. అధ్యక్ష అభ్యర్థిగా నిలిచిన అనిత షియోరాన్‌పై మాకు అభ్యంతరాలు లేవు. ఆమె మాజీ మల్లయోధురాలు. రెజ్లర్లు దేశానికి మెడల్ తెచ్చేందుకు ఎంత కష్టపడతారనే సంగతి ఆమెకు తెలుసు. మాజీ రెజ్లర్లు ఫెడరేషన్‌లో ఆఫీస్ బేరర్లుగా ఉండాలని కోరుకుంటున్నాం. అనిత కామన్‌వెల్త్ గేమ్స్ మెడలిస్ట్.. రెజ్లర్ల డిమాండ్లను అర్థం చేసుకుంటుంది' అని సాక్షి, బజరంగ్ తెలిపారు. డిసెంబర్ 21న జరిగే ఎన్నికల్లో రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక లాంఛనమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఓటర్లలో 90 శాతం మంది మద్దతు బ్రిజ్‌భూషణ్ కూడగట్టినట్టు సమాచారం. దీంతో మాజీ రెజ్లర్ అనిత నిలిచినా.. ఆమెకు పెద్దగా అవకాశాలు లేనట్టే. 12 ఏండ్ల అధ్యక్షుడిగా కొనసాగిన బ్రిజ్‌భూషణ్ నేషనల్ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం ఈసారి రేసులో నిలువలేదు. అతడి కుమారుడు కరణ్ సింగ్ (ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంఘం ఉపాధ్యక్షుడు), అల్లుడు విశాల్ సింగ్ (బిహార్ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు)లు సైతం ఎన్నికలకు దూరంగానే ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68